

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఎస్ఐపీబీ నందు మరో రూ.9,076 కోట్లతో 11 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించగా, వాటి ద్వారా 10,531 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 14.07.2026

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 83 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

- 2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు
- ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు
- ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117 కొత్త గేట్ల పనులకు సీఎం శ్రీకారం



**కొత్తపేట/ఆత్రేయపురం(జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ. 152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు.

**వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు**

ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్ట్రన్, సెంట్రల్, వెస్ట్రన్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ. 32 కోట్లతో కొత్తగేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాతగేట్ల స్థానంలో 117 కొత్తగేట్లను తొమ్మిది నెలల్లో

2 లో..



# పోలవరం పరుగులు..!

- ఆర్నెల్లలో కాలువల పనుల పూర్తి..
- 2027 మార్చికి ప్రాజెక్టు సిద్ధం
- రెండేళ్లలో రూ.7,100 కోట్ల పనులు పూర్తి చేసిన ప్రభుత్వం
- 7.2 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు..
- 28.5 లక్షల మందికి తాగునీటి భరోసా

• వివరాలు 2 లో

# హర్మన్ సేన హిస్టరీ

- విదేశీ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి భారత మహిళల జట్టు
- ఇంగ్లండ్‌పై 270 పరుగుల భారీ విజయం
- లార్డ్స్‌లో మెరిసిన స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్




**లండన్:** లార్డ్స్ టెస్టులో టీమిండియా అమ్మాయిలు ఇంగ్లండ్‌ను ఓడించి నయా చరిత్ర సృష్టించారు. ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ కైవసం చేసుకున్న తొలి భారత జట్టుగా హర్మన్ ప్రీత్ సేన రికార్డుపుటల్లోకెక్కింది. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఓవర్‌నైట్ స్కోర్ 6 వికెట్ల నష్టానికి 136 పరుగులతో సోమవారం నాల్గోరోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 186 పరుగులకు ఆలౌటైంది. 457 పరుగుల భారీ ఛేదనలో క్రాంతి గౌడ్(2/54).. సయాలీ సత్ఘరే(2/24)ల ధాటికి ఆతిథ్య జట్టు చేతులెత్తేసింది. కెరీర్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న టమ్మీ బ్యూమంట్ డకౌట్ కాగా..

మిగతా 2లో...

# ఎంబీబీఎస్ సీట్ల పెంపు



- పిడుగురాళ్లకు 100 కొత్త సీట్లు..
- విజయవాడ సిద్ధార్థకు అదనంగా 75 సీట్లు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణకు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేస్తున్న కృషి మరోసారి ఫలించింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తాజాగా రాష్ట్రానికి మరో 175 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసింది. ఇందులో పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 సీట్లతో తొలి అనుమతి లభించగా, విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు అదనంగా 75 సీట్లకు ఎన్ఎంసీ ఆమోదం తెలిపింది. దీంతో 2026-27 విద్యా సంవత్సరంలోనే రాష్ట్రానికి మొత్తం 275 కొత్త ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్య విద్య విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్ఎంసీ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, అధ్యాపకుల నియామకాలు, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, బోధనా ప్రమాణాల మెరుగుదలపై నిరంతరం సమీక్షలు నిర్వహించారు. ప్రణాళికాబద్ధంగా చేపట్టిన చర్యల ఫలితంగానే వరుసగా ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు ఎన్ఎంసీ నుంచి ఆమోదాలు లభిస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

మిగతా 2లో...

# 'షార్ట్ హజ్' సిద్ధం



- తొలిసారిగా 20 రోజుల ప్యాకేజీ..
- దరఖాస్తులోనే ఆప్షన్ ఎంపిక తప్పనిసరి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హజ్-2027 యాత్రలో తక్కువ రోజుల వ్యవధిలో యాత్ర పూర్తి చేయాలనుకునే వారికి కేంద్ర హజ్ కమిటీ ప్రత్యేకంగా "షార్ట్ హజ్" సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని

మిగతా 2లో...

# కన్నీళ్లపై రాజకీయం వద్దు

- మత్స్యకారుల కన్నీళ్లపై రాజకీయాలు మానుకో జగన్
- నష్టపరిహారం ఇవ్వలేని జగన్‌కు పరామర్శ చేసే అర్హత లేదు: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలకు అందాల్సిన పరిహారాలను సైతం పెండింగ్‌లో పెట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, నేడు విశాఖకు వచ్చి పరామర్శ పేరుతో రాజకీయాలు చేయడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారుల కన్నీళ్లు కనిపించని జగన్‌కు, ఇప్పుడు మాత్రం అకస్మాత్తుగా సానుభూతి గుర్తుకు వచ్చిందా అని మంత్రి ప్రశ్నించారు. ఆనాడు నష్టపరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగిన బాధిత కుటుంబాలను పట్టించుకోని వారు, ఈరోజు పరామర్శ పేరుతో వస్తే ఆ కుటుంబాలు ఎలా నమ్ముతాయని నిలదీశారు.

ఐదేళ్లపాటు అవకాశం ఉన్నప్పటికీ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించకుండా, సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం, ఇప్పుడు వారి కన్నీళ్లపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మంత్రి అన్నారు.

మిగతా 2లో...



# భోగాపురం ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..!

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరాంధ్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025' పరిధిలోకి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుని తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అధికారిక గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భోగాపురం నుంచి నేరుగా అంతర్జాతీయ విమానాల రాకపోకలకు చట్టపరమైన మార్గం సుగమమైంది.

మిగతా 2లో...

# హర్మూజ్‌పై ట్రంప్ కన్ను..!

- "జలసంధిని మేమే నియంత్రిస్తాం.. ఇక మాకే చెల్లించాలి"
- అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ ముదురుతున్న ఉద్రిక్తతలు
- పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు.. ప్రపంచ చమురు మార్కెట్లలో ఆందోళనలు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకంగా ఉన్న హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- హర్మూజ్ జలసంధిని తామే స్వాధీనం చేసుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ఇరాన్‌కు ఎలాంటి నియంత్రణ ఉండబోదని ఘాటు హెచ్చరికలు చేశారు. ఇదే సమయంలో అమెరికా సైన్యం ఇరాన్‌పై మరోసారి భీకర వైమానిక దాడులు నిర్వహించగా, ఇరాన్ కూడా యూఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ దాడులకు ప్రతిస్పందిస్తోంది. దీంతో పశ్చిమాసియాలో మరోసారి పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో జరిగిన చర్చల్లో కాల్పుల విరమణకు సంబంధించిన అన్ని అంశాలపై ఇప్పటికే ఒప్పందం కుదిరిందన్నారు. అయితే చివరి క్షణంలో ఇరాన్ వెనక్కి తగ్గి కొత్త మార్పులు కోరిందని ఆరోపించారు.

**మేమే సంరక్షిస్తాం- మాకు డబ్బులు కట్టాలి: ట్రంప్**

'నిన్న 11 గంటలపాటు సమావేశం జరిగింది. అన్ని అంశాలపై అంగీకారం కుదిరింది. సమావేశం ముగిసిన తర్వాత మళ్లీ ఫోన్ చేసి కొన్ని మార్పులు చేయాలని చెప్పారు. గత 47 ఏళ్లుగా ఇరాన్ ఇలానే వ్యవహరిస్తోంది. ఇది చాలా కాలం కిందటే ముగియాల్సిన అంశం.'

మిగతా 2లో...


# ఉద్యోగులకు పాత పెన్షన్ అవకాశం..!



- సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- అర్హులైన ఉద్యోగులకు ఒక్కసారిగా అవకాశం
- మూడు నెలల్లోపు ఆప్షన్ నమోదు తప్పనిసరి
- ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నెం.53 విడుదల

# సుప్రీంలో తెలంగాణకు నిరాశ..!

- బనకచర్ల ప్రాజెక్ట్ నిలుపుదల కోరుతూ పిటిషన్
- ఏపీ ప్రభుత్వానికి నోటీస్ జారీకి అభ్యర్థన
- పిటిషన్ ను తోసిపుచ్చిన అత్యున్నత న్యాయస్థానం



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది.

మిగతా 2లో...

# రక్తపాతం తర్వాత విషాంతం..!

- షాబాద్ ఆరు హత్యల కేసులో కీలక మలుపు
- నిందితుడు రాజ్‌కుమార్ మృతదేహం స్వాధీనం
- పక్కనే పాయిజన్ బాటిల్, సెల్‌ఫోన్ గుర్తింపు
- సెల్ఫీ వీడియోపై దర్యాప్తు



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలోని షాబాద్‌లో సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల వద్ద వెంచర్‌లో ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని చూసి డయల్ 100కు స్థానికులు సమాచారమిచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు రాజ్‌కుమార్ మృతదేహంగా నిర్ధారించడంతో పాటు పాటు పక్కన పాయిజన్ బాటిల్‌తో పాట సెల్‌ఫోన్ గుర్తించారు.

మిగతా 3లో...

# హర్మన్ సేన హిస్టరీ

(మొదటి పేజీ తరువాయి)

హీథర్ నైట్(13)లను ఔట్ చేసిన క్రాంతి విజయానికి పునాది వేసింది. మూడో రోజు పోరాడిన అమీ జోన్స్.. నాలుగోరోజు తొలి సెషన్‌లోనే ఔటవ్వగా.. టీమిండియా విజయం మరింత సులువైంది. తొలి సెషన్ మొదట్లోనే అమీ జోన్స్(54) వికెట్ తీసిన స్నేహ్ రాణా(4/42) ఆతిథ్య జట్టు ఓటమిని ఖాయం చేసింది. సోఫీ ఎకిల్‌స్టోన్(50)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 22పరుగులు జోడించిన ఇసీ వాంగ్(1)ను దీప్తి శర్మ బౌల్డ్ చేసింది. తర్వాతి ఓవర్లోనే లారెన్ బెల్(0)ను దీప్తి బౌల్డ్ చేయగా.. క్రీజులో కుదురుకున్న ఎకిల్‌స్టోన్‌ను రాణా ఔట్ చేసి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించింది. అంతకుముందు టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేయగా.. ఇంగ్లండ్‌ను 170 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో టీమిండియాకు 115 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించగా.. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 7వ వికెట్ల నష్టానికి 341 పరుగుల వద్ద టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. దీంతో భారత్ కు 456 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. 457 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ కు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. అమీ జోన్స్, సోఫీ ఎక్లెస్టోన్ ఇద్దరు మాత్రమే అర్ధసెంచరీలతో ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా నాలుగు వికెట్లు తీయగా.. సయాలీ, క్రాంతి, దీప్తి శర్మ తలో రెండు వికెట్లు తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్ లో ఐదు వికెట్లు, రెండో ఇన్నింగ్స్ లో రెండు వికెట్లు తీసిన క్రాంతి గౌడ్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

**స్కోర్‌బోర్డు... :**

ఇండియా తొలి ఇన్నింగ్స్ : 285 పరుగులు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ : 170పరుగులు

ఇండియా రెండో ఇన్నింగ్స్ : 341/7డిక్లేర్డ్

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: బౌచర్ (ఎల్‌బి)సయాలీ 2, బ్యూమౌంట్ (బి)క్రాంత్ గాడ్ 0, హీథర్ నైట్ (సి)రీచా (బి)క్రాంతి గాడ్ 13, స్కీవర్ బ్రంట్ (బి)స్నేహ్ రాణా 11, కాప్సే (బి)సయాలీ సత్‌గైర్ 21, అమీ జోన్స్ (సి)షెఫాలీ వర్మ (బి)స్నేహ్ రాణా 54, మాడీ విల్లర్స్ (సి)రీచా ఘోష్ (బి)స్నేహ్ రాణా 26, ఎక్లేస్టోన్ (బి)స్నేమ్ రాణా 50, వాంగ్ (బి)దీప్తి శర్మ 1, లారెన్ బెల్ (బి)దీప్తి శర్మ 0, లారెన్ ఫిలెర్ (నాటౌట్) 4, అదనం 4. (62.5ఓవర్లలో ఆలౌట్) 186పరుగులు.

**వికెట్ల పతనం:** 1/2, 2/6, 3/23, 4/34, 5/59, 6/126, 7/135, 8/157, 9/159, 10/186

**బౌలింగ్:** సయాలీ సత్‌గైర్ 10-2-24-2, క్రాంతిగాడ్ 11-0-54-2, స్నేహ్ రాణా 19.5-0-42-4, శ్రీచరణి 9-2-25-0, దీప్తి శర్మ 12-0-36-2, షెఫాలీ వర్మ 1-0-1-0.

# ఎంబీబీఎస్ సీట్ల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

గత మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల పెంపు గణనీయంగా నమోదైంది. 2024-25లో 150 సీట్లు, 2025-26లో 30 సీట్లు పెరగగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏకంగా 275 సీట్లు మంజూరయ్యాయి. దీంతో మూడు సంవత్సరాల్లో మొత్తం 455 ఎంబీబీఎస్ సీట్లు పెరిగినట్లయింది.


ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ, భవిష్యత్తులో కూడా మరిన్ని సీట్ల పెంపు, వైద్య విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు కొనసాగిస్తామని వెల్లడించారు.

# సుప్రీంలో తెలంగాణకు నిరాశ..!

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబం ధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్ ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

# కృష్ణమ్మ ఒడికి గోదావరి జలాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతూ కృష్ణమ్మ ఒడికి చేరాయి. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి విడుదలైన నీరు పోలవరం కుడి ప్రధాన కాల్వ ద్వారా సుమారు 175 కిలోమీటర్లు నాలుగు రోజుల పాటు ప్రయాణించి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదిలో కలిసింది. వరుసగా 12వ ఏడాది కూడా పట్టిసీమ ఎత్తిపోతల పథకం కృష్ణా డెల్టాకు వరంగా మారి, దాదాపు 13 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీటి భరోసా కల్పిస్తోంది.

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గడం, కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించడం రైతులకు ఊరటనిచ్చింది. గత బుధవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నీటిని విడుదల చేయగా, ఆ జలాలు నాలుగు రోజుల ప్రయాణం అనంతరం శనివారం రాత్రి పవిత్ర సంగమానికి చేరుకున్నాయి. ప్రస్తుతం సంగమం వద్ద గోదావరి ఎర్రటి జలాలు, కృష్ణా నదీ నీలిరంగు జలాలు కలిసిన దృశ్యం సందర్శకులను ఆకట్టుకుంటోంది.

**వర్షాభావంలో రైతులకు పట్టిసీమే ఆధారం :** ఈ నెల 1వ తేదీ నుంచే కృష్ణా డెల్టాకు సాగునీటి విడుదల ప్రారంభమైంది. ప్రస్తుతం పులిచింతల బ్యాలెన్సింగ్ జలాశయం నుంచి కూడా నీటిని విడుదల చేస్తున్నప్పటికీ, అక్కడ కేవలం 32 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇందులో 9 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉండటంతో మిగిలిన నీటినే సాగు అవసరాలకు వినియోగించాల్సి వస్తోంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందుబాటులోకి రావడం డెల్టా రైతులకు ఎంతో ఊరటనిస్తోంది. వరుసగా 12 సంవత్సరాలుగా పట్టిసీమ ద్వారా సాగునీరు అందుతుండటంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఖరీఫ్‌కు 48 టీఎంసీల నీటి లక్ష్యం :** ఖరీఫ్ సీజన్‌లో నెలకు సుమారు 12 టీఎంసీల చొప్పున మొత్తం 48 టీఎంసీల గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటం, సాగునీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుని పంటలను విజయవంతంగా సాగు చేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. గోదావరి-కృష్ణా నదుల అనుసంధానానికి ప్రతీకగా నిలిచిన పట్టిసీమ పథకం మరోసారి తన ప్రాధాన్యాన్ని చాటుకుంటూ, డెల్టా ప్రాంతంలో వ్యవసాయానికి భరోసాగా నిలుస్తోంది.

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

(మొదటి పేజీ తరువాయి)



అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ. 24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాం :** ఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిది :** గోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ. 1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. పిచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కొవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ. 1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం సూచించారు.

**అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యం :** రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించపరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కన్నీళ్లపై రాజకీయం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

నష్టపరిహారాలను పెండింగ్‌లో ఉంచిన వారు ఇప్పుడు బాధితులను పరామర్శిస్తే అది నిజమైన మానవత్వమా, లేక రాజకీయ ప్రదర్శనా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని మంత్రి వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 63 ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్‌లకు సంబంధించిన రూ. 3.15 కోట్లను 2024 జూలై 8న విడుదల చేశామని, అలాగే రూ. 9.90 కోట్ల డీజిల్ (ఆయిల్) సబ్సిడీ బకాయిలను 2024 జూన్‌లోనే విడుదల చేసి మత్స్యకారులకు అందించామని తెలిపారు. విద్యుత్ సబ్సిడీ విషయంలో కూడా వైసీపీ ప్రభుత్వం జోన్--నాన్ జోన్ పేరుతో వేలాది మంది మత్స్యకారులను అన్యాయానికి గురి చేసిందన్నారు. 2018-19లో 52,946 మందికి విద్యుత్ సబ్సిడీ అందగా, వైసీపీ పాలనలో 2023-24 నాటికి అది 47,091 కలెక్షన్లకు పడిపోయిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జోన్-నాన్ జోన్ అనే వివక్షను పూర్తిగా తొలగించి 54,033 కలెక్షన్లు పునరుద్ధరించడంతో పాటు, 2026లో మరో 12,500 కొత్త కలెక్షన్లు మంజూరు చేసి ప్రస్తుతం మొత్తం 62,181 సబ్సిడీ విద్యుత్ కనెక్షన్లు కల్పించామని, ఇందుకోసం ప్రభుత్వం రూ. 1,150 కోట్ల మేర సబ్సిడీ భారం భరిస్తోందని చెప్పారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారులకు అందించే భృతిని కూడా కూటమి ప్రభుత్వం రూ. 10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచిందని తెలిపారు. 2023-24లో 1,16,613 కుటుంబాలకు ప్రయోజనం అందగా, 2026-27లో 1,28,388 మత్స్యకార కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 20 వేల చొప్పున భృతి అందించామని వెల్లడించారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణగా పరిహారాల చెల్లింపుల గణాంకాలను మంత్రి ప్రస్తావించారు. 2022-23లో 74 మరణాలు నమోదైనా కేవలం 31 అర్హులైన క్లెయిమ్‌లకే రూ. 3.10 కోట్లు విడుదల చేశారని, 2023-24లో 45 మరణాలు నమోదైనా కేవలం నాలుగు క్లెయిమ్‌లను మాత్రమే పరిష్కరించి రూ. 40 లక్షలు చెల్లించారని తెలిపారు. అప్పుడు న్యాయం చేయని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు... ఇప్పుడు అండగా ఉంటానంటే ఆ మాటలకు ఎంత విలువ ఉంటుంది? ఓదార్పు కంటే ముందు బాధితులకు న్యాయం చేసిన చరిత్ర చూపించాలి. అదే ప్రజలు అడిగే మొదటి ప్రశ్న అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారుల కోసం చేయాల్సిన పని చేయని జగన్, కూటమి ప్రభుత్వం పెండింగ్ బకాయిలు విడుదల చేసి, సంక్షేమ పథకాలను పునరుద్ధరించి, బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన తర్వాత విశాఖకు వచ్చి మొసలి కన్నీళ్లు కార్చడం నిజమైన సానుభూతి కాదని, అది కేవలం రాజకీయ నాటకమేనని మత్స్యకారులే ప్రశ్నిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మత్స్యకారుల విశ్వాసం మాటలతో కాదు... చేతలతోనే సంపాదించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# హర్మూజ్‌పై ట్రంప్ కన్ను..!

(మొదటి పేజీ తరువాయి)

అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ ఇప్పటివరకు అమెరికాతో కుదుర్చుకున్న అనేక ఒప్పందాల్ని ఉల్లంఘించిందని కూడా ఆయన ఆరోపించారు. 'వారితో ఇప్పటికే 10 ఒప్పందాలు చేసుకున్నాం. ప్రతిసారీ అవే ఉల్లంఘించారు. ఇక మీదట వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయి. హర్మూజ్ జలసంధిని మేమే నియంత్రిస్తాం. అందుకు మాకే డబ్బులు చెల్లించాలి. మా ఆధీనంలోనే ఉంచుకుంటాం. నిర్వహణ బాధ్యతల్ని కూడా మేమే చేపడతాం. సంరక్షకులుగానూ వ్యవహరిస్తాం. ఇప్పటివరకు ఎలాంటి ప్రతిఫలం లేకుండానే అమెరికా ఆ జలసంధికి రక్షణ ఇస్తూ వచ్చింది. ఇక ఆ పరిస్థితి ఉండదు. ధనిక దేశాలు చెల్లింపులు చేయాల్సిందే. మా వాళ్లను ప్రమాదంలో పడేసినందుకు ఇది పరిహారం' అని హెచ్చరించారు ట్రంప్.

ట్రంప్ వ్యాఖ్యలతో పాటు అమెరికా సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) కూడా జులై 12న ఇరాన్‌లోని పలు కీలక సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ప్రకటించింది. అధికారిక ప్రకటన ప్రకారం- ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత రాడార్ కేంద్రాలు, క్షిపణి, డ్రోన్ మౌలిక సదుపాయాలు, ఫాస్ట్ అటాక్ మిలిటరీ బోట్లను లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపినట్లు వెల్లడించింది. దాడులు చేసిన దానికి సంబంధించిన వీడియోలను కూడా విడుదల చేసింది.

**అమెరికా దాడుల్ని తీవ్రంగా ఖండించిన ఇరాన్ :** మరోవైపు అమెరికా చర్యల్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. గత 24 గంటల్లో అమెరికా జరిపిన దాడులు ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించడమే కాకుండా, అంతర్జాతీయ శాంతి భద్రతలకు కూడా తీవ్రమైన ముప్పుగా మారాయని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అమెరికా హర్మూజ్ జలసంధి భద్రతా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వల్ల ప్రపంచ సముద్ర వాణిజ్య రవాణాపై ప్రతికూల ప్రభావం పడుతోందని కూడా ఇరాన్ ఆరోపించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది అమెరికానేనని, ఇరాన్ రవాణా మౌలిక సదుపాయాలు, ఫిషింగ్ బోట్స్, ఇతర వాతావరణ కేంద్రాలపై దాడులు జరిపిందని పేర్కొంది.

**ఇరాన్ కూడా భీకర దాడులు- అంతర్జాతీయ మీడియా :** ఇదే సమయంలో ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ మాట్లాడుతూ-అమెరికాతో కుదిరిన అవగాహనా ఒప్పందం ప్రస్తుతం సంక్లిష్ట దశలోకి వెళ్లిందన్నారు. హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్‌కు ఇచ్చిన గడువు పూర్తికాకముందే అమెరికా ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. అమెరికా కావాలనే ఈ ఒప్పందాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసిందని కూడా విమర్శించారు. ఈ పరిణామాల మధ్య ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (×=+జ) కూడా ప్రతిస్పందించింది. అమెరికా తాజా దాడులకు ప్రతీకారంగా ఒమన్, బహ్రెయిన్, కువైట్ ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులు జరిపినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అమెరికా లేదా దాని మిత్రదేశాలు మరోసారి సైనిక చర్యలకు దిగితే మరింత తీవ్ర ప్రతిస్పందన తప్పదని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. ఇటు మరోసారి హర్మూజ్ కేంద్రంగా ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# ఉద్యోగులకు పాత పెన్షన్ అవకాశం..!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నెం. 53ను విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు. ఈ ఉద్యోగులు సీపీఎస్ నుంచి ఓపీఎస్ కు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ

ఉత్తర్వుల ప్రకారం, జీవో జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల లోపు అర్హులైన ఉద్యోగులు తమ ఆప్షన్ ను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ వెల్లడిం చింది. ఒకసారి ఓపీఎస్ లేదా సీపీఎస్కు సంబంధించి ఉద్యోగి ఎంచుకున్న ఆప్షనన్ను మార్చుకునే అవకాశం ఉండదని ప్రభుత్వం పేర్కొంది. గడువులోపు ఎలాంటి ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు యథావిధిగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) పరిధిలోనే కొనసాగుతారని జీవోలో స్పష్టం చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన జీవో ఎంఎస్ నెం. 53ను ఆర్థిక శాఖ అధికారికంగా విడుదల చేసింది.

# భోగాపురం ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..!



(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర హోంశాఖ ఉత్తర్వుల ప్రకారం కేటగిరీ-1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ గుర్తింపుతో విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్, విదేశీయుల ప్రవేశ, నిష్క్రమణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను అధికారికంగా నిర్వహించే అవకాశం కలిగింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత విదేశాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలకు అంతర్జాతీయ ప్రయాణాలు మరింత సులభం కానున్నాయి. అలాగే పర్యాటకం, ఐటీ, పారిశ్రామిక రంగాలతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలోనూ ఈ నిర్ణయం కీలక పాత్ర పోషించనుందని అధికారులు భావిస్తున్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ప్రధాన కేంద్రంగా మారనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ఆ ప్రాంత అభివృద్ధికి మరో మైలురాయిగా నిలవనుంది. విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ కనెక్టివిటీ పెరగడంతో పాటు వాణిజ్య, ఉపాధి అవకాశాలూ గణనీయంగా విస్తరించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, తాజా ఉత్తర్వులు హోంశాఖ అదనపు కార్యదర్శి నితేశ్ కుమార్ వ్యాస్ పేరిట జారీ అయ్యాయి.

# పోలవరం పరుగులు..!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రానికి పోలవరం జీవనాడి అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 194 టీఎంసీలు నిల్వ ఉంటాయని, 200 టీఎంసీల వరద నీరూ వినియోగించుకోవచ్చని చెప్పారు. పోలవరం ద్వారా 7.2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు వస్తోందని, 23.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు సందర్శన, సమీక్ష సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు.



అంతకుముందు చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. తొలుత విహంగ వీక్షణం ద్వారా ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. ప్రాజెక్టు స్పిల్ వే నుంచి గోదావరి వరద నీటి ప్రవాహం, ఎగువ, దిగువ కాఫర్‌డ్యామ్ మధ్య జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆ తర్వాత ప్రాజెక్టులోని ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, గ్యాప్ 2లతో పాటు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులను ముఖ్యమంత్రి పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో భేటీ అయిన సీఎం ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారు.

"పోలవరం ద్వారా 28.5 లక్షల మందికి తాగునీటి సరఫరా జరుగుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. పోలవరం ప్రాజెక్టు పునరావాస బాధితులకు న్యాయం చేస్తున్నాం. 2019 నాటికి 72 శాతం పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. 2019 తర్వాత పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయినా గుర్తించలేదు. ఇప్పటి వరకు 37 సార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించడంతో పాటు 136 సార్లు ప్రాజెక్టుపై సమీక్ష చేశాను."

'ఇప్పటివరకు 89 శాతం పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. 2019-2024 మధ్య కేవలం 2 శాతం పోలవరం పనులే జరిగాయి. మేం వచ్చిన రెండేళ్లలో 15 శాతం పోలవరం పనులు పూర్తయ్యాయి. రెండు సంవత్సరాల్లో రూ. 7,100 కోట్ల విలువైన పోలవరం పనులు పూర్తయ్యాయి. స్పిల్ వే రేడియల్ గేట్స్, కాఫర్‌డ్యామ్ సహా పలు పనులు పూర్తయ్యాయి. అనుకున్న సమయం ప్రకారమే పోలవరం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఆగస్టు 14 నాటికి అనకాపల్లి జిల్లాలో గోదావరి జలాలకు స్వాగతం పలుకుతూ అఖండ హారతి ఇస్తామని' చంద్రబాబు పేర్కొన్నారు.

ఆర్నెళ్లలోపు పోలవరం కాలువల పనులన్నీ పూర్తవుతాయని చంద్రబాబు వివరించారు. ఫేజ్-1 పోలవరం పనులకు రూ. 30,456 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పనులకు కేంద్రం ప్రభుత్వం రూ. 8323 కోట్లు ఇచ్చిందని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల్లో ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ. 7100 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. 2027 మార్చి నాటికి అన్ని పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

శ్రీశైలం జలాలు రాగానే సెప్టెంబర్ 1న వెలిగొండ ప్రాజెక్టు కూడా ప్రారంభిస్తామని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేసిందన్నారు. నిర్దేశిత సమయం ప్రకారం 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టుల కోసం జిల్లాకు అదనంగా రూ. 2 కోట్లు ఇస్తామని వివరించారు. సీఎం వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు ఉన్నారు. పోలవరంలో పర్యటన అనంతరం చంద్రబాబు అమరావతి బయల్దేరారు.

# 'షార్ట్ హజ్' సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ పథకం ద్వారా సుమారు 20 రోజుల వ్యవధిలో హజ్ యాత్ర పూర్తి చేసే అవకాశం కల్పించనున్నట్లు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో మదీనాలో రెండు లేదా మూడు రోజుల బస కూడా ఉంటుందని, ప్రస్తుతం అమలులో ఉన్న 35-45 రోజుల సాధారణ హజ్ ప్యాకేజీతో పోలిస్తే ధరలో ఎలాంటి తేడా ఉండదని స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా గరిష్ఠంగా 10వేల మంది యాత్రికులకు మాత్రమే ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని మంత్రి తెలిపారు. హజ్ దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించే సమయంలోనే "షార్ట్ హజ్" ఆప్షన్‌ను తప్పనిసరిగా ఎంచుకోవాలని, ఒకసారి దరఖాస్తు సమర్పించిన తర్వాత ప్యాకేజీని మార్చుకునే అవకాశం ఉండదని పేర్కొన్నారు. షార్ట్ హజ్‌కు దరఖాస్తు చేసిన వారిని లాటరీ ద్వారా ఎంపిక చేస్తారని, ఎంపిక కాకపోయినా సాధారణ హజ్ ప్యాకేజీకి ఆటోమేటిక్‌గా పరిగణిస్తారని వివరించారు. ఒకే కవర్‌లోని యాత్రికులందరూ ఒకే ప్యాకేజీని ఎంచుకోవాల్సి ఉంటుందని, రెండు వేర్వేరు ప్యాకేజీలకు అవకాశం ఉండదన్నారు.

షార్ట్ హజ్ యాత్రలు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చిన్, కోల్‌కతా, అహ్మదాబాద్ ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. హజ్-2027 దరఖాస్తుల గడువు ఈ నెల 20తో ముగియనున్నందున అర్హులైన వారు ముందుగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఎంచుకుని గన్నవరం విమానాశ్రయం ద్వారా హజ్ యాత్రకు వెళ్లే రాష్ట్ర యాత్రికులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.

## పీవీఎన్ మాధవ్‌పై అసత్య ఆరోపణలు తగవు: దర్శనపు శ్రీనివాస్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌పై కొందరు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ అన్నారు.. మంగళగిరిలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు నెలలుగా రాష్ట్రంలో దళితవాదం, దళిత క్రైస్తవం పేరుతో కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన కొందరు నాయకులు రాజకీయ అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. యువతను ధర్మం, సంస్కృతి, దేశభక్తి వైపు నడిపించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కృషి చేస్తున్నారని, దీనిని జీర్ణించుకోలేక కొందరు విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో పేదలు, కార్మికులు, రైతుల పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని దర్శనపు శ్రీనివాస్ విమర్శించారు. దేవాలయ భూముల వ్యవహారాలు, యువత భవిష్యత్తుతో ఆటలాడే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా కొన్ని రాజకీయ శక్తులు మతం, కులం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నాయని ఆరోపించారు. దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం సమర్థవంతంగా పాలన సాగిస్తోందని, రాజకీయ ప్రయోజనాల కోసం దళితులు, మతాల పేరుతో కొందరు రాజకీయాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలను గతంలో వ్యతిరేకించినవారే ఇప్పుడు దళితుల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మంగళగిరి పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బొక్క నరసింహారావు, ఓబులేశ్వరరావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల సరఫరా వ్యవస్థపై అధ్యయనం



- **మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో భువనేశ్వర్‌లో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కమిటీ పర్యటన**

**భువనేశ్వర్ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఆసుపత్రులకు మందుల కొనుగోలు, నిల్వ, పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కమిటీ సోమవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో అధ్యయన పర్యటన చేపట్టింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రాధికా రెడ్డి నేతృత్వంలోని కమిటీ అక్కడి వైద్య సేవల నిర్వహణ విధానాన్ని పరిశీలించింది.

ఈ సందర్భంగా ఒడిశా మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆ సంస్థ ఎండీ డాక్టర్ పోమాతుడు, ఇతర అధికారులతో కమిటీ సమావేశమైంది. రాష్ట్రంలో సర్వీసెస్ కార్పొరేషన్ ద్వారా ఏటా సుమారు రూ.750 కోట్ల విలువైన మందులను కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. బోధనా ఆసుపత్రుల్లో అవసరమైన మందుల్లో 30 శాతం, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 శాతం వరకు స్థానికంగా కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మందుల సరఫరాదారులకు బిల్లులను ఒకటి నుంచి రెండు నెలల్లోపు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు.

సమావేశం అనంతరం కమిటీ సభ్యులు భువనేశ్వర్‌లోని ప్రభుత్వ క్యాపిటల్ హాస్పిటల్‌తో పాటు కేంద్ర ఔషధ గిడ్డంగిని సందర్శించి, మందుల నిల్వ, నాణ్యత నియంత్రణ, పంపిణీ, డిజిటల్ మానిటరింగ్ విధానాలను పరిశీలించారు. ఆయా వ్యవస్థల నిర్వహణపై అధికారులతో చర్చించి పలు అంశాలపై వివరాలు సేకరించారు.

కమిటీలో వైద్య ఆరోగ్యశాఖ సీనియర్ అధికారి గణపతిరావు, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్, ఏపీఎస్ఎంఐడీసీ డ్రగ్ వింగ్ ఇన్‌చార్జి సాధు శ్రీనివాసరావు, ఫార్మసీ అధికారులు వై. పద్మ మీనాక్షి, శ్రీనివాస్, ఏపీఎస్ఎంఐడీసీ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు. కమిటీ అధ్యయన నివేదిక ఆధారంగా రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులకు మందుల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఇరాన్‌రివెంజ్ లిస్ట్‌లో 13 మంది ప్రపంచ నేతలు



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ సుప్రీం లీడర్ దివంగత అయతుల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత అమెరికా, ఇజ్రాయెల్ నేతలపై ఇరాన్ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ తన మొదటి బహిరంగ ప్రసంగం చేస్తూ, 13 మంది ప్రపంచ నేతలతో కూడిన ఒక 'రివెంజ్ లిస్టు'ను ప్రకటించారు. ఇరాన్ జాతీయ దినపత్రిక 'హమ్‌షాహ్రీ' శనివారం రాత్రి ఈ జాబితాను ఆన్‌లైన్‌లో ప్రచురించింది. ఈ రివెంజ్ లిస్ట్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.

**రివెంజ్ లిస్ట్‌లో ఉన్నది వీళ్లే! :** ఈ రివెంజ్ లిస్ట్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ముఖాలపై స్నైపర్ గన్ గురిపెట్టినట్లు చూపించారు. మిగిలిన 11 మంది నేతలు ఆరెంజ్ కలర్ జైలు దుస్తుల్లో ఉన్నారు. ఆ 11 మందిలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రీడ్రిచ్ మెర్జ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, అమెరికా సెంట్రల్ కమాండ్ కమాండర్ బ్రాడ్ కూపర్, ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారి మైక్ హక్కబీ, ఇజ్రాయెల్ రక్షణ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఇయాల్ జమీర్, ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్‌ఉన్నారు.

**మొజ్తబా ఖమేనీ హెచ్చరిక :** ఈ సందర్భంగా మొజ్తబా ఖమేనీ మాట్లాడుతూ, "ప్రతీకారం అనేది మా దేశ సంకల్పం. ఇది కచ్చితంగా జరిగి తీరుతుంది. ఈ జాబితాలో ఉన్న నేరస్థులు తమ పరుపులపై ప్రశాంతంగా ప్రాణాలు వదలాలనే కోరికను మేము నెరవేరనీయం. వారిని ప్రశాంతంగా చావనివ్వం" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే తన తండ్రి మరణానికి కచ్చితంగా ఎవరు కారణమో మొజ్తబా ఖమేనీ నేరుగా పేర్కొనలేదు. మరోవైపు 'హమ్‌షాహ్రీ' పత్రిక ఆన్‌లైన్‌లో ప్రచురించిన గ్రాఫిక్ పిక్చర్‌ను టెహ్రాన్ ప్రభుత్వం అధికారికంగా ఆమోదించినట్లు ఎలాంటి సంకేతాలు కనిపించలేదు. ఫిబ్రవరి 28న జరిగిన దాడిలో అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. అదే దాడిలో మొజ్తభా కూడా గాయపడ్డారని వార్తలు వచ్చాయి. ఇటీవల జరిగిన అలీ ఖమేనీ అంత్యక్రియల్లో కూడా మొజ్తబా ఖమేనీ పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో మొజ్తబా మొదటిసారి బహిరంగ ప్రసంగం చేసి, ఈ రివెంజ్ లిస్ట్‌ను ప్రకటించడం గమనార్హం.

**ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర?**

కాగా, ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ ప్లాన్ చేస్తోందని ఇప్పటికే ఆమెరికా మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఇజ్రాయెల్ కూడా ఇదే విషయాన్ని అమెరికాకు అందించింది. ఈ నేపథ్యంలో ట్రంప్‌నకు పొంచి ఉన్న ముప్పుపై అమెరికా అధికారులు నిఘా పెంచారు. ఈ భద్రతా కారణాల వల్లే తుర్కియేలో జరిగిన నాటో సదస్సు నుంచి తిరిగి వచ్చేటప్పుడు, ట్రంప్ విమానాన్ని మార్చి, పాత విమానంలో ప్రయాణించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ, "ఇరాన్ అమెరికా అధ్యక్షుడిని అయిన నన్ను అంతం చేయాలని చూస్తున్నారు. నేను వారి హిస్ట్ లిస్ట్‌లో ఉన్నాను" అని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

**మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించాలనే ఉద్దేశంలో, ఇంతకు ముందు అమెరికా, ఇరాన్‌లు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని చేసుకున్నాయి. కానీ పరస్పర దాడులతో నేపథ్యంలో ఆ ఒప్పందం విచ్ఛిన్నమైంది. టెహ్రాన్ వాణిజ్య నౌకలపై దాడులు చేసిన నేపథ్యంలో, అమెరికా ఆదివార ఉదయం ఇరాన్‌కు చెందిన 140 లక్ష్యాలపై దాడులు చేసింది. అయితే సదరు నౌకలు తమ హెచ్చరికలను బేఖాతరు చేశాయని, అందుకే దాడులు చేశామని పేర్కొంది. ఆ ప్రాంతంలో అమెరికా జోక్యం ముగిసే వరకు వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ప్రకటించింది. దీనితో ప్రపంచంలోని ఐదో వంతు చమురు, గ్యాస్ రవాణా అయ్యే ఈ మార్గంలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా దాడుల తర్వాత బహ్రెయిన్, కువైట్, ఖతార్, ఒమన్ లాంటి గల్ఫ్ దేశాలపై ఇరాన్ తీవ్ర విమర్శలు చేసింది. దీనిపై ఖతార్ స్పందిస్తూ, ఇది చాలా 'ప్రమాదకరమైన పరిణామం' అని వ్యాఖ్యానించింది. ఒమన్ ప్రభుత్వం కూడా ఇరాన్ దాడులను ఖండించింది.

# ఆధార్-విద్యుత్ లింకేజీ లోపాలను సరిచేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

సబ్సిడీ విద్యుత్ అర్హులందరికీ సక్రమంగా అందేలా చర్యలు కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఒకే ఆధార్ నంబర్‌కు పలువురు విద్యుత్ వినియోగదారుల సేవా కనెక్షన్లు అనుసంధానమైన కారణంగా వేలాది మంది అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక భద్రత పెన్షన్లు, సబ్సిడీ విద్యుత్ వంటి ప్రయోజనాలకు దూరమవుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అందుతున్న వినతుల్లో ఈ సమస్య ఎక్కువగా వెలుగుచూస్తోందని పేర్కొన్నారు. తమకు సంబంధం లేని విద్యుత్ కనెక్షన్లు ఇతరుల ఆధార్‌తో అనుసంధానమవడంతో అమాయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

సమస్య పరిష్కారం కోసం విద్యుత్ శాఖ కార్యాలయాలకు వెళ్లిన బాధితులను ఇతర వినియోగదారుల ఆధార్ వివరాలు తీసుకురావాలని కోరడం అన్యాయమని పీవీఎన్ మాధవ్ విమర్శించారు. వ్యవస్థలో జరిగిన లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిదేనని, ప్రజలపై భారం మోపడం సమంజసం కాదన్నారు. సబ్సిడీ విద్యుత్, టారిఫ్ మార్పులు సక్రమంగా అమలు కాకపోవడంతో ఆక్వా రైతులు, నాయీ బ్రాహ్మణులు, స్వర్ణకారులు, వడ్రంగులు, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్య తీవ్రతకు ఈఆర్‌వో కార్యాలయాల్లో సిబ్బంది కొరత కూడా ఒక ప్రధాన కారణమని, రికార్డుల సవరణలు, ఆధార్ లింకేజీ, ఫిర్యాదుల పరిష్కారం వంటి పనులు జాప్యం అవుతున్నాయని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర డేటా ఆడిట్ నిర్వహించి ఒకే ఆధార్‌కు అనుసంధానమైన బహుళ విద్యుత్ సేవా కనెక్షన్లను గుర్తించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పీవీఎన్ మాధవ్ ప్రభుత్వాన్ని కోరారు. బాధితుల నుంచి దరఖాస్తు స్వీకరించి శాఖే విచారణ జరిపి లోపాలను సరిచేయాలని, అన్ని ఈఆర్‌వో కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేసి తగిన సిబ్బందిని నియమించాలని సూచించారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాలు, పెన్షన్లు, సబ్సిడీలు నిలిపివేయకుండా తాత్కాలిక రక్షణ కల్పించాలని, జిల్లా స్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారులను నియమించి నిర్ణీత గడువులో ఫిర్యాదులను పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# రక్తపాతం తర్వాత విషాంతం..!

(మొదటి పేజీ తరువాయి)

రాజ్‌కుమార్ సెల్‌ఫోన్‌లో సెల్ఫీవీడియోను పోలీసులు గుర్తించారు. హత్యలకు ముందు సాయంత్రమే నిందితుడు ఈ వీడియో రికార్డు చేసుకున్నట్లు గుర్తించారు. 'బాలిక కుటుంబ సభ్యులు అన్ని విధాలుగా వాడుకుని మోసం చేశారు. అమ్మాయిని నమ్మి మోసపోయాను. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, అప్పుల వల్ల జీవితంపై విరక్తి చెందానని' రాజ్‌కుమార్ వీడియోలో పేర్కొన్నాడు. అనంతరం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

రాజ్‌కుమార్ మెంటల్ కండీషన్ బాగా లేదు : గుర్తుతెలియని మృతదేహం ఉందని, డయల్ 100కు సమాచారం వచ్చిందని ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి పేర్కొన్నారు. ఘటనాస్థలానికి తమ సిబ్బంది చేరుకున్నారని చెప్పారు. మృతదేహం రాజ్‌కుమార్‌దేనని గుర్తించారని వివరించారు. నిందితుడు బెట్టింగ్‌లో నష్టపోయి రూ.2 కోట్లు అప్పులు చేశాడని వెల్లడించారు. భారీగా అప్పుల వల్ల రాజ్‌కుమార్ మెంటల్ కండీషన్ బాగా లేదని తరుణ్ జోషి చెప్పారు.

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఆరు హత్యలు తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. షాబాద్ మండలం దైవాలగూడ గ్రామానికి చెందిన పార్వతి రాజ్‌కుమార్ 2018లో తన గ్రామానికే చెందిన సరితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి పరీక్షిత్, దైవీక్షిత్ అనే పిల్లలున్నారు. వివాహం తర్వాత నిందితుడు డ్రైవర్‌గా పనిచేస్తూ షాబాద్‌లోని పీఆర్ఆర్ స్టేడియంలో నివాసం ఉంటున్నాడు.

ఈ నేపథ్యంలో తన ఇంటి పక్కనే ఉండే ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని(17)పై రాజ్‌కుమార్ కన్నేసి వేధించసాగాడు. ఈ విషయంపై బాలిక కుటుంబం అతడితో గొడవ పడినా మార్పు రాలేదు. మే 16న ఇంటర్ పరీక్షల కోసం బాలికను ఆమె తల్లి శంషాబాద్‌లోని కాలేజీకి తీసుకెళ్లింది. ఇది గమనించిన నిందితుడు అమ్మాయిని అనుసరిస్తూ కళాశాలకు వెళ్లాడు. పరీక్ష పూర్తయి బయటకొచ్చిన బాలిక చేయి పట్టుకుని లాగేందుకు ప్రయత్నించాడు.

సమీపంలోనే ఉన్న తల్లి కుమార్తెను తీసుకుని దూరంగా పారిపోయేందుకు ప్రయత్నించగా రాజ్‌కుమార్ వెంటపడి అడ్డగించి దుర్భాషలాడాడు. 'మీ తండ్రిని చంపినట్టే మిమ్మల్ని చంపేస్తా' అంటూ బెదిరించి వెళ్లిపోయాడు. నిందితుడి బెదిరింపులతో ఆందోళనకు గురైన బాలిక, ఆమె తల్లి షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మే 16న ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదైంది. ఈ విషయం తెలిసి రాజ్‌కుమార్ పరారయ్యాడు. ఆ తర్వాత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నిందితుడు జూన్ 12న ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు.

మరోవైపు బాలికను వేధించడంపై రాజ్?కుమార్?ను భార్య సరిత నిలదీసింది. దీంతో ఆమెతోనూ అతడు ఘర్షణ పడుతున్నాడు. దీనిపై పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. అప్పటికే తనపై పోక్సో కేసు పెట్టారని బాలిక కుటుంబంపై, పంచాయితీ పెట్టించిన భార్య మీద కూడా నిందితుడు పగ పెంచుకున్నాడు. మీ కుటుంబాన్ని అంతమొందిస్తానంటూ బాలికను, ఆమె తల్లిని పలుమార్లు హెచ్చరించాడు. భయపడ్డ బాధితులు షాబాద్ పోలీసులకు చెప్పగా వారు సరిగా స్పందించలేదు.

రాజ్‌కుమార్ దీన్ని అదునుగా తీసుకుని హత్యకు ప్లాన్ రచించాడు. శుక్రవారం సాయంత్రం చేవెళ్లకు వెళ్తున్నానంటూ భార్య సరిత దగ్గర నగదు తీసుకున్నాడు. చేవెళ్లలోని ఒక సెల్ఫ్ డ్రైవ్ సంస్థలో కారు అద్దెకు తీసుకున్నాడు. మద్యం తాగిన నిందితుడు ఇంటికి బిర్యానీ తెస్తానని భార్యకు చెప్పాడు. అప్పటికే సిద్ధం చేసుకున్న కత్తితో కారులో నేరుగా



అమ్మాయి ఇంటికి వెళ్లాడు. వెనుకవైపు నుంచి వెళ్లి తలుపు తట్టగా బాలిక తెరిచింది.

ఈ సమయంలో ఎవరంటూ బాలిక తల్లి రాగా ఆమెను కత్తితో ఛాతీ, కడుపు భాగంలో నాలుగుసార్లు పొడిచాడు. ఇది గమనించి వచ్చిన బాలిక నానమ్మను కత్తితో విచక్షణారహితంగా పొడవడంతో ఆమె కుప్పకూలింది. కళ్ల ముందు క్షణాల వ్యవధిలో జరిగిన ఘోరాన్ని చూసి బాలిక భయంతో వణికిపోయింది. ఈ క్రమంలో నిందితుడు కత్తి చూపించి తనతో పాటు ఆ అమ్మాయిని బలవంతంగా తీసుకెళ్లాడు. వెనుక వైపు నుంచి బాలికను తీసుకెళ్లి కారులో ఎక్కించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఈ సమయంలో ఇంట్లో దివ్యాంగురాలైన ఆమె సోదరి (19) ఉన్నారు.

బాలికను కారులో ఎక్కించుకున్న నిందితుడు, సొంతూరు దైవాలగూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు దగ్గరికి తీసుకెళ్లి అక్కడ ఆమెను బయటకు ఈడ్చి గొంతుకోసి కిరాతకంగా హతమార్చాడు. అనంతరం తన ఇంటికి వెళ్లి కత్తితో భార్య గొంతు కోశాడు. నిద్రిస్తున్న ఇద్దరు పిల్లల గొంతులూ కోసి దారుణంగా చంపేశాడు. అనంతరం రాజ్‌కుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత సోదాలు నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబ సభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇవాళ పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.



## 2వ దశ జాబ్ క్యాలెండర్‌కు సన్నద్ధత వేగవంతం: సీఎస్ సాయి ప్రసాద్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలో రెండో దశ డైరెక్ట్ రిక్రూట్మెంట్ జాబ్ క్యాలెండర్ తయారీని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్యదర్శులు, శాఖాధిపతులతో కలిసి పోస్టుల నోటిఫికేషన్, ఈ-హెచ్‌ఆర్‌ఎం పూర్తి, స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణ, సీనియారిటీ జాబితాల తయారీ, రోస్టర్ల ప్రారంభం, ఏపీపీఎస్సీ తదితర నియామక సంస్థలకు ఇండెంట్లు పంపడం వంటి అంశాలపై సమీక్షించారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఉద్యోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన కేసులను ఆరు నెలల్లోగా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో సర్వీసెస్ అండ్ హెచ్‌ఆర్‌ఎం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ రెండో దశ జాబ్ క్యాలెండర్ అమలుకు సంబంధించిన టైమ్‌లైన్‌ను వివరించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఉద్యోగుల కేటాయింపు, స్థానిక కేడర్లకు సంబంధించిన ప్రక్రియలు పూర్తి చేసి అవసరమైన జీవోలను వెంటనే జారీ చేస్తామని తెలిపారు. సమావేశంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

## విశాఖలో ఏపీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్రస్థాయి సమావేశం


- **ఉద్యమ కార్యాచరణపై కీలక నిర్ణయాలు.. సాయంత్రం మీడియా సమావేశం**

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంస్థ పరిరక్షణ, ప్రభుత్వానికి ఉద్యోగుల డిమాండ్లను సమగ్రంగా తెలియజేసే తదుపరి ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు ఈ నెల 14న విశాఖపట్నంలోని మద్దిలపాలెంలో రాష్ట్రస్థాయి జేఏసీ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఉద్యమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఈ నెల 14 నుంచి ప్రజాప్రతినిధులను కలిసే కార్యక్రమాలతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన తదుపరి చర్యలపై సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం సాయంత్రం 4 గంటలకు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణను అధికారికంగా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

అదే సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న లి30 ప్రధాన డిమాండ్లపై సమగ్ర నివేదికతో కూడిన వినతిపత్రం (బుక్‌లెట్)లిలిను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆర్టీసీ చైర్మన్లను కలిసి ఆ బుక్‌లెట్‌ను అందజేసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని కోరనున్నట్లు జేఏసీ కన్వీనర్లు పేర్కొన్నారు.

## రేపటి నుంచి అమరావతి ఛాంపియన్ షిప్ 2.0



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) ::** అమరావతి ఛాంపియన్ షిప్ 2.0 కార్యక్రమం ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు వెల్లడించారు. శాప్ ఎమ్‌డి ఎస్ భరణి, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, డబల్ ఒలంపియన్ రజినితో కలిసి ఛాంపియన్ షిప్ 2.0 పోస్టరును సోమవారం శాప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనల మేరకు గతేడాది అమరావతి ఛాంపియన్ షిప్‌ను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. గతంలో అండర్-22 విభాగంలో పోటీలు నిర్వహించగా, ఈసారి అండర్-17, 23 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాలతో పాటు విశ్వవిద్యాలయ స్థాయి క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 24 వరకు 175 నియోజకవర్గాల్లో ప్రాథమిక ఎంపికలు, ఆగస్టు 1 నుంచి 15 వరకు జిల్లా స్థాయి పోటీలు, ఆగస్టు 20 నుంచి 25 వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఈ ఛాంపియన్ షిప్‌లో బాస్కెట్‌బాల్, కబడ్డీ, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్‌తో పాటు మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు మొత్తం రూ.94 లక్షల నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఈసారి మూడు లక్షల మంది క్రీడాకారులు పాల్గొనాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

## హత్య కేసులో నిర్లక్ష్యం.. పీఎస్‌లోని 23 మంది సిబ్బంది మొత్తం బదిలీ

**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఓ హత్య కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది మొత్తాన్ని బదిలీ చేసిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. బుచ్చిరెడ్డిపాలెం పీఎస్‌లో పనిచేస్తున్న మొత్తం 23 మంది సిబ్బందినీ జిల్లా ఎస్పీ అనిత వేజెండ్ల బదిలీ చేశారు. సీఐ మాతంగి శ్రీనివాసరావును వీఆర్‌కు పంపారు.

**అసలేం జరిగిందంటే.. :** బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయ అధికారి శ్రీహరి జూన్ 15న కారులో పెంచలకోన వెళ్లి వస్తుండగా మృతి చెందారు. ముందుగా గుండెపోటుగా చిత్రీకరించారు. తర్వాత సొంత బావమరిది ఆస్తి కోసం కుక్కలను చంపే ఇంజక్షన్లు ఎక్కించినట్లు వెలుగులోకి వచ్చింది. మొదట హత్య అని చెప్పినా ఆ కోణంలో దర్యాప్తు చేయకపోవడం, కేసును పక్కదోవ పట్టించారనే ఆరోపణలు, దర్యాప్తులో నిర్లక్ష్యం వహించినట్లు ఎస్పీ దృష్టికి వెళ్లడంతో సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు.

# కొలువుల కొట్లాటకై వేలాదిగా తరలిరండి

- జూలై 15న జరిగే మహా ధర్నాను జయప్రదం చేయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



కరీంనగర్ ప్రతినిధి, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 15న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం రోజున సిపిఎం జిల్లా కార్యాలయం ముకుంద లాల్ మిశ్రాభవన్లో మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విభాగాల్లో లక్షల్లో కొలువులు ఖాళీగా ఉన్నాయని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నప్పటికీ హామీని నెరవేర్చలేదన్నారు. ఉద్యోగాల కోసం ప్రశ్నించే యువతకు సమాధానం చెప్పాల్సిన పాలకులు పకోడీలు బజ్జీలు వేయడం కూడా ఉద్యోగాలే అంటూ వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతా రాహితమైన వైఖరి అన్నారు. పార్లమెంటులో ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం కేంద్ర మంత్రిత్వ శాఖలో దాదాపు 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అలాగే సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీలు, ఐఐఎం, లతోపాటు ట్రిబుల్ ఐటీలు, నీట్ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇతర ఉన్నత విద్యా సంస్థలు కేంద్ర ప్రభుత్వ విద్యాలయాల్లో దాదాపు 37వేల ఉద్యోగాలు భర్తీకి నోచుకోలేదన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ సెక్టార్కు అప్పగిస్తూ ఉద్యోగాల ను కుదించేస్తుందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై యూత్ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు.స్వయంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ హైదరాబాదులో నిరుద్యోగులతో మాట్లాడుతూ కాంగ్రెస్ వస్తే నిరుద్యోగుల బతుకులు మారుతాయి అని భరోసా ఇచ్చారన్నారు.మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు గడుస్తున్న కేవలం 16 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందన్నారు. ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలు చేయకుండా నోటిఫికేషన్లు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంద న్నారు. 20వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 7000 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ,హాస్టల్లో మగ్గుతూ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వమ్ము చేస్తుందన్నారు. నోటిఫికేషన్ రాక భవిష్యత్తుకు భరోసా లేక ఈ ప్రభుత్వంలో కూడా నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు 9000 మంది పదవీ విరమణ పొందుతున్నారని,ఈ విధంగా రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువకులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు.స్వయం ఉపాధి రుణాలకు నిధులు మంజూరు చేయకుండా దరఖాస్తులు స్వీకరించి రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని కేంద్ర బీజేపీ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ, జెఎల్, డిఎల్, గ్రూప్ 1 2 3 4 తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు నెలకు 5000 నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. ఎలాంటి వివాదాలు కోర్టు కేసులు లేకుండా వివాదాస్పదమైన జీవోలను తొలగించి పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ను, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు అన్నిటిని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 15న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నాలో యువకులు, నిరుద్యోగులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, జి రాజేశం, నాయకులు రాయికంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య, మాతంగి శంకర్, చల్ల లక్ష్మణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పెద్దపట్నం అగ్నిగుండ మహోత్సవాలు



ఓదెల, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రసిద్ధ శైవ క్షేత్రంగా వర్ధిల్లుతున్న ఓదెల శ్రీ భ్రమరాంబమల్లికార్జున స్వామి ఆలయ పెద్దపట్నం అగ్నిగుండం మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లతో ముస్తాబైంది. ఆదివారం రాత్రి ప్రభుత్వ విప్ విజయ రమణారావు స్థానిక నాయకులతో కలిసి బ్రహ్మోత్స వాలలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏకాదశి ముందు నిర్వహించే మహోత్సవం లో 12వ తేదీ ఆదివారం ఉదయం నుండి మొదలయ్యే పూజల్లో గణపతిపూజ పుణ్యావాచనము మండపస్థాపన శ్రీ వీరభద్రరాధన కార్యక్రమాలతో మొదలై రాత్రి శ్రీ భద్రకాళి ఆవాహనతో అగ్నిగుండ ప్రజ్వలంతో పెద్ద పట్నం నిర్వహిస్తారు,తదుపరి సోమవారం ఉదయాతూర్వం నిరీక్షణతో ఎదురుచూస్తున్న అగ్నిగుండం దాటుట తదనంతరం దక్షయాగ కథాశ్రవణంతో ముగిస్తారు. ఈ వేడుకల నిర్వహణలో పాలక మండలి చైర్మన్తో చీకట్ల మొండయ్య మరియు సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు ఈవో బోట్క సదయ్య తెలిపారు. ఈ వేడుకల మహోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తన్మయత్వంతో భక్తి పారవశ్యంలో తేలుతారు.

## కేసీఆర్‌పై పంటంత ప్రేమ, అభిమానం

- పంటలకు జీవం పోసింది కేసీఆరే
- 'కేసీఆర్' మీద అభిమానంతో నారుమడి పోసిన యువ రైతు సంగెం శ్రీకాంత్



నర్సంపేట జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : వరంగల్ జిల్లాలోని నర్సంపేట రూరల్ మండలం గురిజాల గ్రామానికి చెందిన యువరైతు సంగేం శ్రీకాంత్ కేసీఆర్, రైతులకు చేసిన సేవలను దృష్టిలో ఉంచుకొని రైతు బాంధవుడు కేసీఆర్ అని, తెలంగాణ రైతన్నన్ని బతికిచ్చిందే కేసీఆర్ అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద అభి మానంతో నారుమడి కేసీఆర్ పేరుతో పోసి అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పుడు ఆ నారుమడి మొలక వచ్చి కేసీఆర్ పేరు పచ్చని మొక్కలతో ఎంతో అందంగా అగుపడుతూ రైతుల గుండెల్లో కెసిఆర్ పేరును ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రాజెక్టులు కట్టి తెలంగాణ యావత్ ప్రతి ఎకరానికి గోదావరి నీళ్లు ఇయ్యాలనే తపనతో కేసీఆర్ ముందుకు సాగాడని అందుకు రైతుల గుండెల్లో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతాడని మొక్కలకు వర్షం, నీరు ఎంత అవసరమో తెలంగాణకు కెసిఆర్ పాలన అంతే అవసరమని శ్రీకాంత్ కేసీఆర్ పాలన ఆకాంక్షను వెలిబుచ్చాడు.

## తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఆర్థిక సహాయం

### రైలు కిందపడి దంపతులు ఆత్మహత్య ఘటనలో

నర్సంపేట జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన బుడిగే రవి కుమార్-శిరీష దంపతులు ఇటీవల హైదరాబాదులోని ఘట్కేసర్ వద్ద రైలు కిందపడి బలవర్మరణానికి పాల్పడ్డారు. ఆదివారం వారి దశ దిన కర్మ కార్యక్రమం పాపయ్య పేట గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా బుడిగే రవికుమార్ బాల్య మిత్రులంతా కలిసి బుడిగే రవికుమార్-శిరీషల చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు. అనంతరం చిన్న నాటి మిత్రులంతా కలిసి 35,500/-రూపాయలు ఆర్థిక సహకారం వారి కుమారులైన సుశాంత్, విద్వాంష్ లకు అందించారు.

ఈ సందర్భంగా రవికుమార్ బాల్య మిత్రులు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా,కుటుంబంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన కూర్చొని మాట్లడుకొని పరిష్కరించుకోవలసిన అవసరం ఉందని, తొందరపడి



ఆత్మహత్యలు చేసుకొని చిన్నపిల్లలకు, తల్లి దండ్రులకు, తోబుట్టువులకు, స్నేహితులకు దూరం కావొద్దని ఆయన చిత్రపటం వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. చిన్నప్పుడు కలిసిమెలిసి ఆటలాడుకున్న బుడిగే రవి లాంటి మంచి మిత్రుడు ఆకస్మికంగా మరణించటం చాలా విచారకరమన్నారు. మిత్రులందరికీ ఏ ఆపద వచ్చిన నేనున్నానంటూ ముందు వరుసలో నిలబడే బుడిగే రవి లాంటి మిత్రున్ని కోల్పోవడం చాలా బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.

బుడిగే రవి- శిరీషల కుటుంబానికి,వారి పిల్లలకు ఎల్లవేళలా అండగా ఉంటామని వారు తెలిపారు.

ఈకార్యక్రమంలో బుడిగే రవికుమార్ మిత్రులైన లింగాల దేవేందర్, ఉప్పరి రాజు, పూజారి చిన్ని, మొగిలి సునీల్ రెడ్డి, సూర లింగమూర్తి, చిట్టె కుమారస్వామి, రాధారపు సదానందం, బొక్కల నరసింహారావు, బర్లా రమేష్, ముత్యాల సారంగం, దస్రు నాయక్, వంగ సాంబరాజు, కుండే రమేష్, కుండే కుమారస్వామి (మెడికల్ స్టోర్), కుండే కుమారస్వామి (ఎలక్ట్రీషియన్), పెంద్యాల వెంకన్న, మిర్యాల కుమారస్వామి, మధ్య బోయిన రమేష్,ఆకుల రవి, కంచ రమేష్, అంగోతు విజేందర్, గడ్డల రాజు, భూక్య నర్సింహా, లింగాల రమేష్, రాధారపు కుమారస్వామి, కుండే రాములు, లక్ష్మీనారాయణ సార్, బాదావత్ మంగ్యా, తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని వ్యక్తి మృతి

నల్లబెల్లి జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఉద్యోగం పర్మినెంట్ కావట్లేదని మనస్థాపానికి గురై ఉరేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగాపురం గ్రామానికి చెందిన చీకటి విక్రమ్ (38) అనే యువకుడు నెక్కొండ మండలం పత్తిపాక సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు.

## అంబులెన్స్‌లో కవలలకు జన్మనిచ్చిన గిరిజన తల్లి!



ఏటూరునాగారం, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : ములుగు జిల్లా వాజేడు మండలం ములకపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళ తెల్లం మంజు (31) ఆదివారం అంబులెన్స్ లోనే కవల మగ శిశువులకు జన్మనిచ్చింది. ఈఎంటీ తిప్పినపల్లి మానస చాకచక్యంగా వ్యవహరించి సురక్షిత ప్రసవం చేయించి తల్లి, శిశువుల ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. ఇప్పటికే ముగ్గురు పిల్లలకు తల్లైన తెల్లం మంజుకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. వెంటనే పైలట్ దశరథ్, ఈఎంటీ తిప్పినపల్లి మానస ములకపల్లి గ్రామానికి చేరుకుని గర్భిణిని వాజేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో నొప్పులు తీవ్రం అయ్యాయి. పరిస్థితిని వెంటనే అంచనా వేసిన ఈఎంటీ మానస అంబులెన్స్లోనే విజయవంతంగా ప్రసవం నిర్వహించి ఇద్దరు మగ కవల శిశువులను సురక్షితంగా ప్రసవింపజేశారు. అనంతరం తల్లి, శిశువులను క్షేమంగా ఆస్పత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చేర్పించారు. ఈఎంటీ తిప్పినపల్లి మానస సమయస్ఫూర్తి, సేవాభావాన్ని వైద్యులు, కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు. ఇప్పటికే ముగ్గురు పిల్లలు ఉన్న మంజుకు తాజాగా కవలలు జన్మించడంతో ఆమె అయిదుగురు పిల్లలకు తల్లిగా మారింది.

## ప్రజాసేవలో నిబద్ధతకు నిదర్శనం మదన్ మోహన్

- 13 ఏళ్ల పాటు సమర్థవంతంగా సేవలందించారు
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



గద్వాల, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : గద్వాల పట్టణం లోని ఎస్‌వీ ఈవెంట్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన రిటైర్డ్ తహసీల్దార్ మదన్ మోహన్ ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన సభలో మహ బూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మదన్ మోహన్ తన వద్ద సుమారు 13 సంవత్సరాల పాటు వ్యక్తిగత సహాయకుడిగా (పీఏ) నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గంపై పూర్తి అవగాహన, ప్రజా సమస్యలపై పట్టున్న వ్యక్తిగా మదన్ మోహన్‌ను ఎంపిక చేసుకున్నానని తెలిపారు. ఆయన సమన్వయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని, ప్రాజెక్టులు, రహదారులు, పాఠశాల భవనాల నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి పనులు తక్కువ సమయంలో పూర్తి చేయగలిగామని పేర్కొన్నారు. మంత్రిగా పనిచేసిన కాలంలో జిల్లాలోని దాదాపు ప్రతి గ్రామానికి రహదారులు నిర్మించామని, ఆ సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికీ ప్రజలకు ఉపయోగ పడుతున్నాయని డీకే అరుణ అన్నారు. ఉద్యోగ జీవితమంతా ఎలాంటి ఆరోపణలు, వివాదాలకు తావులేకుండా నిజాయితీగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రజలకు విశేష సేవలు అందించిన మదన్ మోహన్ భవిష్యత్తులో కూడా సమాజ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట్రాములు, జిల్లా కోశాధికారి మీర్జాపురం రామచంద్రరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మీర్జాపురం వెంకటేశ్వరరెడ్డి, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు ఎప్పటికి మోసపోరు

- ఇచ్చిన హామీలు, చేసిన నిర్లక్ష్యం, ప్రజలను నిరాశపరిచిన పాలనను అంత తేలికగా మర్చిపోరు...
- జి.మధుసూదన్ రెడ్డి దేవరకద్ర శాసన సభ్యులు



దేవరకద్ర జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : బైక్ ర్యాలీలు, హడావుడి కార్యక్రమాలతో ప్రజల తీర్పును మార్చలేరు దేవరకద్ర నియోజకవర్గంలో బీఆర్ఎస్ చేరికల పేరుతో నిర్వహించిన బైక్ ర్యాలీలు, హడావుడి కార్యక్రమాలు ప్రజల తీర్పును మార్చలేవు అని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వస్తున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు కొంతమందిని కూడగట్టి రాజకీయ మ్యాజిక్‌లు చూపించే ప్రయత్నం చేస్తున్నారు.కానీ వాళ్ళను ప్రజలు నమ్మేస్థితిలో లేరు. దేవరకద్ర ప్రజలు అమాయకులు కాదు. దశాబ్దపు అరాచకాలతో విసిగిపోయి ఇప్పుడిప్పుడే ఊపిరి తీసుకుంటున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, చేసిన నిర్లక్ష్యం, ప్రజలను నిరాశపరిచిన పాలనను అంత తేలికగా మర్చిపోరు.మీరు ఎన్ని ర్యాలీలు చేసినా... ఎన్ని చేరికలు చూపించినా ప్రజల విశ్వాసం అభివృద్ధి, పారదర్శక పాలన వైపే ఉంటుందన్నారు ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి దేవరకద్ర నియోజక వర్గ ప్రజల తీర్పు స్పష్టం మాటలు కాదు, పనులకే ప్రజల మద్దతు షోపుటపు ర్యాలీలు కాదు అదే ర్యాలీలో కేసీఆర్ ఫామ్ హౌస్ వదిలి ప్రజల మధ్యకు రావాలని ధర్నా చెయ్యండి మీకు ప్రజలపై చిత్త శుద్ధి ఉంటే అని సూచించారు.

## న్యాయమే గెలిచింది...

: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుపతి యాదవ్..



బోయిన్ పల్లి, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఓల్డ్ బోయిన్ పల్లి 262వ డివిజన్ వెస్లీ టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో, జరిగిన ఎన్నికలలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి గుర్రం వెంకటేశ్వర్లు గెలుపొందారని, బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలవడంతో బిజెపి పార్టీ నాయకులు, కాలనీ వాసులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గుర్రం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధికి దోహద పడతానని, కాలనీ ప్రజలు న్యాయం వైపు మొగ్గు చూపారని, నిరంతరం సమస్యలపై కృషి చేస్తానని తెలిపారు. మరి అదే విధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి మాట్లాడుతూ... కాలనీ అసోసియేషన్ ఎన్నికలు, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు మార్గ నిర్దేశాలుగా మారుతాయని, ధర్మం, న్యాయం ఎప్పటికి ఓడిపోదు అని పేర్కొ న్నారు. కాలనీ వాసులు ధర్మానికి కట్టుబడి ఓటు వేసి వెంకటేశ్వర్లును రెండో సారి గెలిపించిన కాలనీవాసులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కాలనీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను

## పరిశీలించిన రెవెన్యూ అదనపు కలెక్టర జె.ఎల్.బి హరిప్రియ

- ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇప్పటివరకు నమోదైన డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షి...
- ఎన్యుమరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి...



దేవరకద్ర జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను జడ్చర్ల ఎన్నికల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆదివారం మిడ్జిల్ మండలం వేముల గ్రామంలోని పోలింగ్ కేంద్రం నెం. 258ను, వెలుగోముల గ్రామం పోలింగ్ కేంద్రం నెం. 239ను, బైరాన్ పల్లి పోలింగ్ కేంద్రం నెంబర్ 231 లను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇప్పటివరకు నమోదైన డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించారు. ఈ పోలింగ్ కేంద్రాల పరిధిలో అత్యల్ప డిజిటైజేషన్ నమోదును గమనించిన అదనపు కలెక్టర్ ఏన్యూమరైజేషన్ ఫారాల డిజిటైజేషన్ను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బి.ఎల్.ఓ లు ఎన్యుమరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏఈఆర్ఓ/తహసీల్దార్, బీఎల్ఓ సూపర్వైజర్, గ్రామ సర్పంచ్, బీఎల్ఓలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారి పట్టివేత

- డ్రైవర్, యజమాని పై కేసు నమోదు



కల్వకుర్తి జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : కల్వకుర్తి మండల పరిధిలో శనివారం రాత్రి దసర్లపల్లి గ్రామం నుంచి వస్తున్న అక్రమ ఇసుక టిప్పర్ను రామగిరి, రఘుపతి పేట వద్ద, అనుమతులు లేవని సమాచారం పొందిన పోలీసులు టిప్పర్‌ను చెక్ చేసి, అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలిసి కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి సమాచారం మేరకు, టిప్పర్‌కు అవసరమైన అనుమతులు లేనందున డ్రైవర్, యజమానినీ అదుపులోకి తీసుకొని కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుకను చట్టవిరుద్ధంగాతరలించడంపై కేసు నమోదు చేసి, సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకోవడతాయని ఎస్ఐ హెచ్చరించారు. కల్వకుర్తి ఎస్సై,కురుమూర్తి.

### కామ్రేడ్ కాంపల్లి లక్ష్మయ్యకు ఘన నివాళులు అర్పించిన

## యంసిపిఐ(యు) పార్టీ రాష్ట్ర కమిటీ బృందం

- లక్ష్మయ్య వారి కుటుంబ సభ్యుల సేవలు మరువలేనివిలి
- యంసిపిఐ(యు) పార్టీ రాష్ట్రకార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి
- పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ సబ్బని కృష్ణ



మంచిర్యాలజిల్లా బెల్లంపల్లి జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని శంసుంగ్ శంషిర్ నగర్ బస్తీకి చెందిన లక్ష్మయ్య ఇటీవల అనారోగ్య కారణాల వల్ల మృతి చెందిన యంసిపిఐ(యు) పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ లక్ష్మయ్య నివాసానికి యంసిపిఐ(యు) పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదెగోని రవి,పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ సబ్బని కృష్ణ మరియు పార్టీ రాష్ట్రకమిటీ సభ్యుల బృందం వెళ్ళి లక్ష్మయ్య మృతికి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2006 సంవత్సరంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో పార్టీ ప్రారంభమైన నాటి నుండి కామ్రేడ్ లక్ష్మయ్య, ఆయన భార్య కాంపల్లి రాధా కామ్రేడ్ సబ్బని కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఉద్యమ పోరాటాలలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా, జిల్లా ఉద్యమ నిర్మాణ పోరాటంలో కూడా తమదైన పాత్ర పోషించారని, పోలీస్ అక్రమ కేసులను, నిర్బంధాలను కూడా ఎదుర్కొన్నారని, ప్రభుత్వ ఉద్యోగిగా రిటర్మెంట్ అయినా లక్ష్మయ్య ఎం సిపిఐ పార్టీలో చేరడమే కాకుండా, తన భార్యను కూడా పార్టీలోకి ఆహ్వానించారని, ఎం సిపిఐయు పార్టీ జిల్లా నాయకులుగా తానుంటూ, తన భార్య కాంపల్లి రాదను అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలుగా,రాష్ట్ర కమిటీ సభ్యురాలుగా పార్టీ ఎన్నుకున్నప్పటికీ స్వాగతించారే తప్ప ఏనాడు వ్యతిరేకించలేదని, పార్టీ సిద్ధాంతానికి,క్రమశిక్షణకు కట్టుబడి ఉన్నారని, ఏనాడు పార్టీని వీడలేదని, తుది శ్వాస వరకు కూడా పార్టీలోనే కొనసాగారని, వీరి మరియు వీరి కుటుంబ సభ్యుల సేవ పార్టీ ఎప్పటికీ మర్చిపోదని, లక్ష్మయ్య మరణం పార్టీకి తీరనిలోటని ఇది ఎవరు పూడ్చలేరని, లక్ష్మయ్య ఆశయ స్ఫూర్తితో ఉద్యమించాలని, జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని, వారి ఆశయాలు నెరవేర్చడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళులు అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్, ఆల్ ఇండియా కిషన్ ఫెడరేషన్ కేంద్ర నాయకులు వల్లపు ఉపేందర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నం వెంకన్న,ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ డెమొక్రటిక్ ఉమెన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పుష్ప,రాగసుధ, రాష్ట్ర నాయకురాలు కుంభం సుకన్య, తాండ్ర కళావతి, బెల్లంపల్లి పట్టణ పార్టీ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, నాయకులు మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో

## పాల్గొన్న దేవరకద్ర శాసన సభ్యుడు జి.మధుసూదన్ రెడ్డి

- నియోజకవర్గంలో నిర్విరామంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు...
- అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు
- పేదవాడి సొంత ఇంటి కల ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం



దేవరకద్ర జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) : దేవరకద్ర నియోజకవర్గం, దేవరకద్ర మున్సిపాలిటీ చౌదరిపల్లి, లాల్ కోటలో గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి, సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే జియంఆర్‌కి వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే జిమ్మెర్ తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలు అందజేశారు. జి.మధుసూదన్ మాట్లాడుతూ.. మా ప్రభుత్వం మహిళా సాధికారితే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు, వడ్డీలేని రుణాలు, పెట్రోల్ పంపుల నిర్వహణ, ఆర్టీసీలో అద్దె బస్సుల ద్వారా ఆదాయం నేరుగా మహిళా సమైఖ్యలో జమ, సోలార్ ప్లాంట్ల ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. మహిళలు ఆర్థిక పురోగతి సాధించేలా ప్రోత్సహిస్తున్నాం అని తెలియజేశారు.

## మంగాపురంతండా లో ముత్యాలమ్మ వేడుకలు



**నేలకొండపల్లి, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) :**
మండలం లోని మంగాపురంతండా లో ఆదివారం ముత్యాలమ్మ పండగ ను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పెద్ద ఎత్తున ప్రభలు కట్టారు. మేళతాళాలతో ప్రదర్శన నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేశారు. ఆటా, పాటలతో సందడి చేశారు. ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి..మొక్కులు చెల్లించుకున్నారు. బంధువులు, కుటుంబ సభ్యుల రాక తండాలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మంగాపురం తండా సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, చెరువుమాధారం మృత్సపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలపై పారా లీగల్ వాలంటీర్ సర్వే



**నేలకొండపల్లి, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) :**
స్థానిక సమస్యల పై పారా లీగల్ వాలంటీర్స్ సర్వే చేపట్టారు. మండలం లోని తిరుమలాపురం లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పారా లీగల్ వాలంటీర్స్ ఇంటింటా సర్వే చేపట్టారు. పెన్షన్స్; రేషన్ కార్డులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులు అందుతున్నాయా లేదా అని క్షేత్ర స్థాయిలో బృందం వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామంలో మహిళ సంఘం భవనం. బస్టాండ్ ఇతరత్రా సమస్యల పై స్థానికులు టీమ్కు దరఖాస్తులు అందించారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలపై స్థానిక సర్పంచ్ కమదన ప్రవీణ్ ను కలిసి వివరించారు. కనీస మౌళిక వసతులు గురించి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా టీమ్ ప్రతినిధి కొలిపాక నాగమణి మాట్లాడారు.... ప్రజలు న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వారం రోజుల పాటు గ్రామంలో క్షేత స్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్ ప్రవీణ్ సహకారం అందించారనీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్స్ యం.నాగమణి, పి.సుశీల, నాగేంద్ర, పద్మావతి, కె.నాగేంద్ర, ఉదయ్, నాగలక్ష్మి , రుక్మిణీ తదితరులు పాల్గొన్నారు.

## బాబుల్ రెడ్డి నగర్ లో కూచిపూడి నృత్య ప్రదర్శన అదుర్స్-ఎస్ వెంకటేష్.



**రాజేంద్రనగర్, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాటేదాన్ డివిజన్ పరిధిలోని పోచమ్మ దేవాలయ బీరలింగేశ్వర కళ్యాణమండపం బాబుల్ రెడ్డి నగర్ లో బీఆర్ఎస్ పార్టీ కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్న అమృత కళాక్షేత్రం అధ్యక్షులు వంగ శ్రీనాథ్ బాబు గౌడ్,కూచిపూడి కళాక్షేత్రం నృత్యా ప్రదర్శన గురువు అమృత పావని గౌడ్ ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యం ప్రదర్శన చూడనికి విచ్చేసిన తల్లి దండ్రులకు కనులకు విందుగా కనిపించిందన్నారు.అనంతరం కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు మాట్లాడుతూ..అమృత కళాక్షేత్రం దాదాపుగా రెండు దశాబ్దాల క్రితం అంటే 20 సంవత్సరాల ముందు స్థాపించబడిన భారతీయ సంప్రదాయ నృత్య కల అయిన కూచిపూడిని పరిరక్షించేడం,ప్రచారం ద్వారా భావితరాలకు అందించడం అమృత కళాక్షేత్రం సంస్థ ప్రధాన లక్ష్యం అన్నారు.అమృత కళాక్షేత్రం విద్యార్థులు వారణాసి(కాశి) జైపూర్ (రాజస్థాన్),ఉత్తర కాశీ,కోల్ కత్త,మధ్యప్రదేశ్ నాగ్ పూర్ అలాగే శ్రీశైలం,యాదాద్రి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలలో నృత్య ప్రదర్శనలు ఇచ్చిన విశేష ప్రశంసలు అమృత కళాక్షేత్రం విద్యార్థులు పొందారు.హైదరాబాదులో అమృత కళాక్షేత్రం శాఖ స్థాపించి మూడు సంవత్సరాలు పూర్తికాబోతున్న కాలంలో ఇకడి విద్యార్థులు కూడా అనేక ప్రముఖ దేవాలయలో,వినాయక మండపాలలో అదేవిధంగా దుర్గామాత మండపాలలో తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.ఇప్పటివరకు హైదరాబాద్ శాఖ ద్వారా 100 మందికి పైగా విద్యార్థులను ప్రతిభవంతులై కళాకారులుగా తీర్చిదిద్దారు.ఈ భారతీయ సంప్రదాయ నృత్య కళా వైభవాన్ని మరింత విస్తరింపజేయాలనే సంకల్పంతో చేస్తున్న కృషి,అమృత కళాక్షేత్రం ద్వారా మరింత విస్తరింపజేయాలనీ మును ముందు యావత్ భారతదేశం కాకుండా ప్రపంచ దేశాలకు నుండి అమృత కలక్షత్రానికి మంచి గుర్తింపు రావాలని కోరారు.కార్యక్రమంలోసంతు గౌడ్ తో పాటు అక్యాం శ్రీనాథ్,శ్రీశైలం,పూజారి శివ, శేఖర్,శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి





**నిజామాబాద్, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) :**
జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డా.రాజశ్రీ ఆదివారం నందిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు,రికార్డుల నిర్వహణ,మందుల నిల్వ,ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్ పనితీరు,వ్యాక్సినేషన్ కార్యక్రమాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రిజిస్టర్లు,రోగుల నమోదు వివరాలు,ఔషధాల నిల్వ,టీకాల భద్రత,కోల్డ్ చైన్ నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని,ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు.రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు నవీకరించాలని,ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి ఆదేశించారు.అనంతరం నందిపేటలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సర్వేను జిల్లా వైద్యాధికారి పరిశీలించారు.సర్వే నిర్వహణ తీరు,నమోదవుతున్న వివరాలు,ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించి,నిబంధనల మేరకు పారదర్శకంగా,సమర్థవంతంగా సర్వేను పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే నిర్వహించాలని,అవసరమైన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.

## సింగరేణి భరోసా యాత్ర ను విజయంతం చేయండి

**నేలకొండపల్లి, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) :**



సింగరేణి భరోసా యాత్ర ను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు... సింగరేణి కార్మికుల భవిష్యత్ కోసం వారి భద్రత కోసం భరోసా కల్పించేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. సోమవారం కేంద్ర మంత్రి కిషన్రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్రావు లు చేపట్టిన భరోసా యాత్ర కు అధిక సంఖ్యలో తరలిరావాలని సూచించారు. ఉదయం 7 గంటలకు నాయకనగూడెం టోల్ గేట్ వద్ద వారి కి స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున రావా సూచించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ, భద్రత పారదర్శక పరిపాలన, బొగ్గు పరిశ్రమ అభివృద్ధి తెలంగాణ ప్రజలు ఆకాంక్ష అన్నారు. కార్మికుల కు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. సింగరేణి బలోపేతం కోసం సాగే ఈ యాత్రలో ప్రతీ ఒక్కరూ కదలిరావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయుకులు సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పుట్టా సత్యనారాయణ, కొండా హర్షవర్ధన్, పిట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి




**ఖమ్మం (జర్నలిస్ట్ ఫైల్) :** 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ భవన్ నందు జిల్లా అధ్యక్షులు షేక్.రంజాన్ అధ్యక్షతన జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ని అమలు చేస్తూ 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయినా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఆరు నెలల్లో పిఆర్సి అమలు చేస్తామని, పెండింగ్ బిల్లులు లేకుండా చెల్లిస్తామని, డిఏలు పెండింగ్ లేకుండా చేస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని, ఉద్యోగులకు సమగ్ర ఆరోగ్య కార్డుల ద్వారా వైద్యం అందిస్తామని మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం సమస్యల పరిష్కరించుకుంటే ఉద్యమించాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, కోశాధికారి వల్లంకొండ.రాంబాబు, జిల్లా కార్యదర్శులు బానోత్ రాందాస్,పినపాక.సురేష్, ధర్మసోత్.నాగేశ్వరరావు,గుగులోత్ రామకృష్ణ, షేక్.ఉద్దండ్ షరీఫ్, పెంట్యాల.ప్రశాంతి, నారపోగు.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వంటిమామిడిలో 'శివ శంకర ఫిల్లింగ్ స్టేషన్' ప్రారంభం

### - ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్





**ములుగు, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) :**
సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి గ్రామ పరిధిలోని తునికి బొల్లారం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'శివ శంకర ఫిల్లింగ్ స్టేషన్' (పెట్రోల్ బంక్) ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా పలువురు రాజకీయ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) బండ ప్రకాష్ ముదిరాజ్, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిలు రిబ్బన్ కట్ చేసి ఈ ఫిల్లింగ్ స్టేషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ నిర్వాహకులు శ్రీరామ్ నర్సింలు ముదిరాజ్, శ్రీరామ్ సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా, కేవలం ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈ బంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సరసమైన, నిర్దిష్టమైన ధరలకే స్వచ్ఛమైన హిందూస్తాన్ పెట్రోలియం ఇంధనాన్ని స్థానిక ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. వంటిమామిడితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాష్ ప్రమాణ స్వీకారం



**వరంగల్ (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో గ్రంథాలయ వ్యవస్థల బలోపేతానికి, గ్రంథాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.వరంగల్ నగరంలోని 19వ డివిజన్ "ఓ సిటీ" కమ్యూనిటీ హాల్‌లో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్‌గా మీసాల ప్రకాష్ ప్రమాణ స్వీకారం ఘనంగా ఆదివారం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బైరెడ్డి బుగ్గారెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడిన కార్యకర్తలకు సముచిత గుర్తింపు ఇస్తున్నామని, అందులో భాగంగానే మీసాల ప్రకాష్‌కు గ్రంథాలయ చైర్మన్ పదవి అప్పగించామని తెలిపారు.ఈ పదవి రావడంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ప్రత్యేక శ్రద్ధతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ చేసిన కృషి ఎంతో ఉందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, స్మశానవాటికల అభివృద్ధి వంటి అనేక పనులు చేపట్టామని చెప్పారు.ప్రజల మధ్య నిత్యం ఉంటూ డివిజన్లలోని సమస్యలను గుర్తించి కొండా మురళీధర్ రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో గోపాల నవీన్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.రానున్న రోజుల్లో ఆయనకు రాష్ట్ర స్థాయి పార్టీ పదవి వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖ ద్వారా రాష్ట్రంలోని ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, బాసర నుంచి భద్రాచలం వరకు వందల కోట్ల రూపాయలతో ఆలయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మేడారం మహాజాతర అభివృద్ధికి రూ.250 కోట్లు వెచ్చించామని, కృష్ణా పుష్కరాలు, గోదావరి పుష్కరాల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.రానున్న గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక కార్పొరేటర్ స్థానాలు గెలిచి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం నూతన చైర్మన్ మీసాల ప్రకాష్ మాట్లాడుతూ, తాను 35 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో యువజన విభాగం నుంచి టీపీసీసీ కార్యదర్శి వరకు వివిధ బాధ్యతలు నిర్వహించానని తెలిపారు.గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కడానికి సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి,టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి,ఎమ్మెల్యేలకు రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, కె ఆర్ నాగరాజు, మామిడాల యశస్విని రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్‌లకు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ కే సముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాజీ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కలువాల నవనితరావు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అంబరీష్ మాజీ కార్పొరేటర్లు వస్కుల బాబు, జారతి రమేష్ బాబు, పల్లం రవి, సోమిశెట్టి ప్రవీణ్, దామోదర్ యాదవ్, బోగి సువర్ణ సురేష్, చింతకుల అనిల్, కావేటి కవిత, బాలినేని సురేష్, గుండు పూర్ణచందర్, నాగపూరి కల్పనా, కతేరశాల వేణు, కేడల పద్మతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# ప్రతి ఎకరాకి సాగు నీరు అందిస్తాం.

## -వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



**ఏన్కూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తాం అని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. ఏన్కూర్ మండలం తిమ్మారావు పేట గ్రామ సమీపంలోని ఎన్ఎస్పి కెనాల్ ఎస్కేప్ లాక్ ల గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వైరా రిజర్వాయర్ కు గోదారి జలాలను విడుదల చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమ ప్రభుత్వమని , సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు బీమా, రెండు లక్షల రూపాయలు రుణమాఫీ అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. గోదావరి జిల్లాల రాకతో రైతుల ముఖంలో చిరునవ్వు కనిపిస్తుందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఖర్చు చేసి లక్షలాది ఎకరాల భూమిని సాగులో తీసుకొచ్చిందని అన్నారు. గోదావరి జిల్లాల రాకతో వైరా రిజర్వాయర్ కళకళలాడుతుందని దీంతో 25వేల ఎకరాల వరి సాగుకు రైతులు సిద్ధం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొర్ర రాజశేఖర్, కట్ల రంగారావు, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, కొప్పుల ప్రభావతి రెడ్డి, సామిల్, సక్రు నాయక్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బహదూర్‌గూడ రైతులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలి

## -సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.

**రాజేంద్రనగర్, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) :**



బహదూర్‌గూడ రైతు భూ పోరాట సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక దీక్షా శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బహదూర్‌గూడలో మొత్తం సుమారు 1,400 ఎకరాల భూమిలో 650 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం తీవ్ర అన్యాయమని అన్నారు.ఈ భూముల విషయంలో రైతులు న్యాయపోరాటం చేసి హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకుని ఇప్పటికే తొమ్మిది నెలలు గడిచినా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.కోర్టు ఆదేశాలను గౌరవించకుండా హైడ్రా వంటి సంస్థలను ఉపయోగించి రైతులను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.హైడ్రా ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో ఎన్ని ఎకరాల భూమిని,ఎవరి నుంచి,ఏ ప్రాతిపదికన స్వాధీనం చేసుకున్నారో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రైతులను బెదిరించి భూములు లాక్కోవాలని కాకుండా,వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు.రైతుల భూములకు పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వకుండా,భూ హక్కులను నిర్ధారించకుండా,బుల్డోజర్లు,బస్ టెర్మినల్,మెట్రో రైలు,ఇతర ప్రాజెక్టుల పేరుతో సాగుభూములను స్వాధీనం చేసుకోవడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు.ప్రభుత్వం రైతులను ఒంటరిగా చేసి బెదిరించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని,రైతులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో గతంలో లక్షల ఎకరాల భూములను క్రమబద్ధీకరించారని,జీవో 58,59ల ద్వారా పట్టాలు,రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయని గుర్తు చేశారు.ప్రస్తుతం వివాదాస్పదంగా ఉన్న ఈ భూములు ప్రభుత్వ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములుగా ఎక్కడా నమోదు కాలేదని తెలిపారు.అయినప్పటికీ దశాబ్దాలుగా సాగు చేస్తున్న నిరుపేద రైతుల నుంచి ప్రభుత్వం పన్నులు వసూలు చేసిందని,ఇప్పుడు అదే భూములపై హక్కులను ప్రశ్నించడం అన్యాయమని అన్నారు."పేదవాడి గొంతును వినిపించేది కమ్యూనిస్టులే. పేదల,రైతుల,కార్మికుల పక్షాన ఎర్రజెండా నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుంది.బహదూర్‌గూడ రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఐ అండగా నిలుస్తుంది" అని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు,రామస్వామి,రైతు సంఘం నాయకులు ప్రభులింగం,సత్యనారాయణ,ఆర్ యాదగిరి.నర్రగిరి,అడ్వకేట్ సతీష్ రెడ్డి,ప్రవీణ్ గౌడ్,గ్రామ రైతులు కృష్ణ మోహన్,రాజు, కేఎం రాజు,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# 9వ వార్డులో నీటి బోరు ప్రారంభోత్సవం

## -మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్



**మంథని (జర్నలిస్ట్ ఫైల్) :** మంథని మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన నీటి బోరు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్ మారుపాక నిహారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ...మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు 9వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఈ నీటి బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు కుసుమ సురేష్, బొజ్జ శ్రీనివాస్, శ్రీను, నాయకులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చిత్రకారిణి స్వాతి విజయ్ ప్రతిభకు డా. గొంగూర వెంకటేశ్వర్లు (డా. జి.వి.) అభినందనలు



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** చిత్రకారిణి స్వాతి విజయ్ ప్రతిభకు డా. గొంగూర వెంకటేశ్వర్లు (డా. జి.వి.) గారి అభినందనలుఖమ్మం నగరంలోని బొడేపూడి స్తూపం, రాధాకృష్ణ మందిరం సమీపంలో నివాసముంటున్న చిత్రకారిణి స్వాతి విజయ్ గారి నివాసాన్ని ప్రముఖ వైద్యులు, శ్రీ రక్ష హాస్పిటల్ చైర్మన్, శ్రీ రక్ష ఛారిటబుల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డా. గొంగూర వెంకటేశ్వర్లు (డా. జి.వి.) గారు సందర్శించారు.ఈ సందర్భంగా స్వాతి విజయ్ గారు రూపొందించిన వివిధ రకాల చిత్రాలను డా. గొంగూర వెంకటేశ్వర్లు (డా. జి.వి.) గారు పరిశీలించి, ఆమె కళా ప్రతిభను, సృజనాత్మకతను అభినందించారు. చిత్రకళలో స్వాతి విజయ్ గారు చూపిస్తున్న ప్రతిభను ప్రశంసిస్తూ ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం స్వాతి విజయ్ గారి తల్లిదండ్రులు కంది నాగాచారి గారు, శశికళ గారిని కూడా డా. గొంగూర వెంకటేశ్వర్లు (డా. జి.వి.) గారు శాలువాలతో సన్మానించి, ఇలాంటి ప్రతిభావంతమైన కళాకారిణిని ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా డా. గొంగూర వెంకటేశ్వర్లు (డా. జి.వి.) గారు మాట్లాడుతూ, చిత్రకళ అనేది భావాలను, సంస్కృతిని ప్రతిబింబించే గొప్ప కళ అని అన్నారు. ప్రతిభ కలిగిన కళాకారులను గుర్తించి ప్రోత్సహించారు.

# 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మం విద్యార్థి సుధగాని ఉపేక్షిత్ విజయకేతనం

**ఖమ్మం, జూలై 13 (జర్నలిస్ట్ ఫైల్) :**



హైదరాబాద్‌లో నిర్వహించిన, 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన, విద్యార్థి సుధగాని ఉపేక్షిత్ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు. గాడియం స్పోర్టోపియా స్కూల్ వేదికగా జరిగిన ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్–12 విభాగంలో పాల్గొన్న ఉపేక్షిత్ తన వేగంతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఉపేక్షిత్, డాక్టర్ సుధగాని కరుణాకర్ – భరణిక దంపతుల కుమారుడు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కోచ్‌ల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా శిక్షణ పొందుతున్న ఆయన, రాష్ట్రస్థాయి పోటీల్లో 60 మీటర్ల పరుగుపందెంలో రజత పతకం, 300 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించి ప్రశంసలు అందుకున్నాడు. అంతేకాకుండా ప్రైజ్ మనీని కూడా కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్‌కు మరోసారి మంచి గుర్తింపు లభించిందని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి. ఉపేక్షిత్ విజయంలో కోచ్‌లు గౌస్ పాషా, హలీం, అందించిన శిక్షణ కీలక పాత్ర పోషించిందని తెలిపారు.ఈ సందర్భంగా విజేత విద్యార్థిని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు. అలాగే జిల్లా క్రీడా ప్రముఖులు, అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు, తల్లిదండ్రులు ఉపేక్షిత్ భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

## అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్ సాయికాంత్ వర్మ



○ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతుల స్వీకరణ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిబంధనలకు లోబడి మానవీయ దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తే అంతిమ లక్ష్యంగా ఉండాలని సూచించారు. సమస్యల మూలాలను గుర్తించి సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తేనే అర్జీదారులకు న్యాయం జరుగుతుందన్నారు. దరఖాస్తులను ఎక్కువ రోజులు పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో దివ్యాంగులు, వయోవృద్ధుల వద్దకు స్వయంగా వెళ్లి వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతి బసు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె. విజయలక్ష్మి, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి. సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవీంద్రబాబు, ఆర్డీవో శ్రీహరి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల అర్జీలను గడువులోగా పరిష్కరించాలి: అదనపు కమిషనర్ కిషోర్



○ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 43 వినతులు స్వీకరణ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ. కిషోర్ అధికారులను ఆదేశించారు. నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక వసతులకు సంబంధించినవే ఉంటున్నాయని, వాటిని అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని సూచించారు.

అర్జీల పరిష్కారంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాచారం అందించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని అదనపు కమిషనర్ తెలిపారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 43 అర్జీలు అందాయి. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 12, ఇంజినీరింగ్ విభాగానికి 15, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 4, యూపీఏ సెల్‌కు 2, ఎలక్షన్ సెల్‌కు 1, అకౌంట్స్ విభాగానికి 3 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ సురేష్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

## నంద్ కిషోర్ గోయెంకా మృతిపై పీవీఎన్ మాధవ్ సంతాపం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జీ ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ సుభాష్ చంద్ర తండ్రి నంద్ కిషోర్ గోయెంకా మృతిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో గోయెంకా కుటుంబానికి తన సానుభూతిని తెలియజేశారు.

నంద్ కిషోర్ గోయెంకా సుదీర్ఘ జీవితాన్ని విలువలు, క్రమశిక్షణ, కుటుంబ వ్యవస్థకు అంకితం చేశారని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆయన మరణం గోయెంకా కుటుంబానికే కాకుండా సన్నిహితులకు కూడా తీరని లోటని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో డాక్టర్ సుభాష్ చంద్రతో పాటు గోయెంకా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. దివంగత నంద్ కిషోర్ గోయెంకా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది

○ భట్టిప్రోలు మండలంలో ఐదుగురికి రూ.7.03 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

○ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా భట్టిప్రోలు మండలానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.7,03,418 ఆర్థిక సహాయం మంజూరైంది. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితుల వైద్య ఖర్చులకు సంబంధించిన దరఖాస్తులను వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపగా, ప్రభుత్వం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు సహాయాన్ని మంజూరు చేసింది. మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ కింద భట్టిప్రోలు గ్రామానికి చెందిన తన్నీరు వెంకటేశ్వర్లుకు రూ.1,84,730, కోనేటిపురం గ్రామానికి చెందిన జంపాని వీరరాఘవులకు రూ.1,52,202, జొన్న శకుంతలకు రూ.1,50,000, వెల్లటూరు గ్రామానికి చెందిన కట్టా పవన్ కళ్యాణ్‌కు రూ.1,32,096, పెదలంక గ్రామానికి చెందిన వేజండ్ల లక్ష్మణరావుకు రూ.84,390 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మొత్తం ఐదుగురికి రూ.7.03 లక్షల మేర ప్రభుత్వం మంజూరు చేసింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అత్యవసర వైద్య చికిత్సల సమయంలో సీఎంఆర్ఎఫ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. తమకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించిన ప్రభుత్వం, సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం మంజూరు చేయించేందుకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఫిర్యాదుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి: ఎస్పీ వకుల్ జిందాల్

○ పీజీఆర్ఎస్‌లో 197 వినతుల స్వీకరణ.. సత్వర పరిష్కారానికి ఆదేశాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు పారదర్శకమైన, చేరువైన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల ఫిర్యాదులకు వేగవంతంగా పరిష్కారం అందిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 197 వినతులను స్వీకరించి ఒక్కో ఫిర్యాదును పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు చట్టబద్ధంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అందిన ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, నిర్దేశిత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదు పరిష్కారమైన తర్వాత తప్పనిసరిగా ఫిర్యాదుదారునికి సమాచారం అందించి వారి సంతృప్తిని నిర్ధారించుకోవాలని, సమాచారం ఇవ్వకుండా ఏ పిటిషన్‌ను కూడా ముగించరాదని స్పష్టం చేశారు. సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి సేవాభావంతో విధులు నిర్వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణలో సిబ్బంది సహకారం అందించారు.

అలాగే అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందిస్తూ, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, వృద్ధులు, నిరుపేదలకు ఈ సేవ ఎంతో ఉపయోగపడుతోందన్నారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అసభ్య సోషల్ మీడియా పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలి

○ నగరంపాలెం పోలీసులకు గుంటూరు పశ్చిమ ఐటీడీపీ నేతల ఫిర్యాదు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఐటీడీపీ నేతలు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు పి. సాంబశివరావు (పి. శివ), నాయకురాలు షేక్ శంశున్నిసా మాట్లాడుతూ మహిళా ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని బాడీ షేమింగ్, వ్యక్తిత్వ హననం, అసభ్య పదజాలంతో దూషించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. గల్లా మాధవిపై అవమానకర వ్యాఖ్యలను ఆమె ఇప్పటికే మీడియా సమావేశంలో ఖండించినప్పటికీ, సంబంధిత వ్యక్తుల వైఖరిలో మార్పు రాలేదని వారు ఆరోపించారు. అద్దంకి శివాజీ పేరుతో ఉన్న సోషల్ మీడియా ఖాతా ద్వారా గల్లా మాధవితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, హోంమంత్రి వంగలపూడి అనిత, పరిటాల శ్రీరామ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తదితర నాయకులపై అసభ్యకర పోస్టులు, వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. కులాలు, వ్యక్తిగత అంశాలను ప్రస్తావిస్తూ విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

రాజకీయ విభేదాలు ఉంటే విధానాలపై విమర్శలు చేయవచ్చని, కానీ మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కావని ఐటీడీపీ నేతలు స్పష్టం చేశారు. అద్దంకి శివాజీ పేరుతో ఉన్న సోషల్ మీడియా ఖాతాను నిర్వహిస్తున్న వ్యక్తిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు కార్యక్రమంలో ఐటీడీపీ కమిటీ సభ్యులు మల్లవరపు కిరణ్, తాడిగిరి వెంకటేష్, వెంకటేశ్వర్లు, శివా, షేక్ అల్తాఫ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖలో ఏపీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్రస్థాయి సమావేశం

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంస్థ పరిరక్షణ, ప్రభుత్వానికి ఉద్యోగుల డిమాండ్లను సమగ్రంగా తెలియజేసే తదుపరి ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు ఈ నెల 14న విశాఖపట్నంలోని మద్దిలపాలెంలో రాష్ట్రస్థాయి జేఏసీ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఉద్యమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఈ నెల 14 నుంచి ప్రజాప్రతినిధులను కలిసే కార్యక్రమాలతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన తదుపరి చర్యలపై సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం సాయంత్రం 4 గంటలకు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణను అధికారికంగా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

అదే సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న లిలి30 ప్రధాన డిమాండ్లపై సమగ్ర నివేదికతో కూడిన వినతిపత్రం (బుక్‌లెట్)లిలిను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆర్టీసీ ఛైర్మన్లను కలిసి ఆ బుక్‌లెట్‌ను అందజేసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల

## గుంటూరు సీజీహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ దాసరి రమేష్ బాధ్యతల స్వీకరణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) గుంటూరు వెల్‌నెస్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ దాసరి రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు సమస్యలను సీఏమఓ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా డాక్టర్ దాసరి రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రి యాజమాన్యాలతో సమన్వయం చేసి రోగి సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని, నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొండా నాగార్జున మాట్లాడుతూ డాక్టర్ల కొరత ఉన్నప్పటికీ ప్రతిరోజూ వందకు పైగా ఓపీ సేవలు అందిస్తున్నామని, దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి. వివేకానంద వైద్యులు నిబద్ధతతో సేవలందించాలని కోరగా, లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు గుమ్మడి సీతారామయ్యచౌదరి సీజీహెచ్ఎస్ సేవలు పెన్షనర్ల హక్కని పేర్కొన్నారు. శస్త్రచికిత్సలకు అధిక రుసుములు వసూలు చేస్తున్న ఎంపానెల్డ్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పెన్షనర్లు, సీజీహెచ్ఎస్ వైద్య, నర్సింగ్, ఫార్మసీ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి వసతులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నీటి వసతులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నుండి జిల్లా కలెక్టర్ లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ జిల్లాలలో ప్రాజెక్ట్ లను ఆదర్శవంతంగా, వినూత్నంగా చేపట్టాలన్నారు. ఉద్యమ రూపంలో చేపట్టాలని అన్నారు. నీటి వసతుల వినియోగం, యాజమాన్యంలో చరిత్ర సృష్టించాలని చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు వందనం తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ రథయాత్రకు భద్రతా ఏర్పాట్లపై ఏఎస్ఎల్ సమావేశం



○ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శాఖల సమన్వయంపై సమీక్ష

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పరిధిలోని వెంకటపాలెం టీటీడీ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 16న ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రథయాత్రకు సంబంధించి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) సమావేశం సోమవారం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, వివిధ శాఖల సమన్వయంపై అధికారులు సమగ్రంగా సమీక్షించారు. టీటీడీ ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అమరావతి ఓఎస్డీ మనోజ్ రామనాథ్ హెగ్డేతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకల నిర్వహణ, అత్యవసర సేవలు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, అగ్నిమాపక, వైద్య సదుపాయాలు, వేదిక నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.

రథయాత్ర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆదేశించారు. భక్తులకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

# రైతుల నిరసనకి దిగి వచ్చిన రిత్విక్ కంపెనీ యాజమాన్యం

○ రైతుల 10 రోజుల నిరసనలకు ఫలితం. చర్చలు సఫలం

○ పంట నష్టాలు బోర్లు బూడిపోవడంపై రైతుల ఆగ్రహం

○ రోడ్డు నిర్మాణం వాటర్ ప్లాంట్లకు కంపెనీ ప్రతినిధుల హామీ



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం రేకలకుంట పంచాయతీ పరిధిలోని రైతులు గత 10 రోజులుగా చేపట్టిన శాంతియుత నిరసనలు ఎట్టకేలకు ఫలించాయి. తమ సమస్యలపై స్పందించాలంటూ స్థానిక రిత్విక్ కంపెనీ ఎదుట రైతులు ఆందోళనలు చేపట్టగా, సోమవారం కంపెనీ యాజమాన్యం రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ చర్చల్లో రైతుల డిమాండ్లకు కంపెనీ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించడంతో వివాదం సద్దుమణిగింది. రేకులకుంట, బాలాజీ నగర్, బాగాదిపల్లె, గొల్లపల్లె, జెడ్. కొత్తపల్లె, డి. అగ్రహారం, టి రామాపురం, వాంపల్లి చెరువు గ్రామాలకు చెందిన రైతులు గత పది రోజులుగా రిత్విక్ కంపెనీ వద్ద పలుమార్లు నిరసనలు తెలియజేశారు. గత మూడేళ్లుగా ఈ కంపెనీ వల్ల స్థానిక ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ పనుల వల్ల విపరీతంగా దుమ్ము, ధూళి లేచి పంటలపై పడుతుండటంతో చేతికి రావాల్సిన పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ పరిధిలో జరుపుతున్న భారీ బ్లాస్టింగ్‌ల కారణంగా భూగర్భంలో మార్పులు వచ్చి బోర్లలోని పైపులు ఇరుక్కుపోతున్నాయని వాటిని బయటకు తీయడం సాధ్యం కాక ఎంతో మంది రైతులు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్థానిక నీటి వనరులను కంపెనీ వాడుకుంటూ, తమకు మాత్రం నష్టాన్ని మిగులుస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో రైతులు ఒక కీలకమైన ప్రతిపాదనను యాజమాన్యం ముందుంచారు. ప్రస్తుతం రేకలకుంట పంచాయతీ ప్రజలు మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠం వెళ్లాలంటే దాదాపు 40 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోంది. అయితే తెలుగుగంగ (బ్రహ్మసాగర్) నుంచి కడపకు నీటిని తరలించేందుకు వేసిన పైప్‌లైన్ పనుల పరిశీలన కోసం ఇప్పటికే రేకలకుంట గంగమ్మ ఆలయం, నూతన సచివాలయం వద్ద నుంచి ఒక రహదారిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు రిత్విక్ కంపెనీ నిర్మించిన రోడ్డు నుంచి కేవలం 3 కిలోమీటర్ల లింక్ రోడ్డును ఏర్పాటు చేస్తే, మండల కేంద్రానికి వెళ్లే దూరం దాదాపు 20 నుంచి 25 కిలోమీటర్ల మేర తగ్గుతుందని, ఇది ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, స్థానిక అభివృద్ధికి కంపెనీ సహకరించాలని డిమాండ్ చేశారు. కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్చలలో రిత్విక్ కంపెనీ తరపున లైజరింగ్ మేనేజర్ జయప్రకాష్, జనరల్ మేనేజర్ తిరుమురుగన్, హెచ్ ఆర్ కిరణ్, మేనేజర్ విష్ణువర్ధన్ తదితర ఉన్నతాధికారుల బృందం పాల్గొంది. రైతులు అడిగిన అంశాలన్నీ న్యాయమైనవేనని కంపెనీ ప్రతినిధులు అంగీకరించారు. రైతులు కోరిన రోడ్డు నిర్మాణానికి సంబంధించి త్వరలోనే పూర్తిస్థాయి ఎస్టిమేషన్ వేయించి పనులను ప్రారంభిస్తామని అలాగే వాటర్ ప్లాంట్ల ఏర్పాటు ఇతర అభివృద్ధి పనులను కూడా త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కంపెనీ తరపున పూర్తి సహకారం ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ తమ నిరసనలను విరమించారు. ఈ సమావేశంలో రేకలకుంట పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలకు గుర్తింపు పొందిన సంఘాలను ఆహ్వానించాలి

- ప్రభుత్వానికి ఏపీజీఈఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష విజ్ఞప్తి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలకు గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నింటినీ ఆహ్వానించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) రాష్ట్రప్రధాన కార్యదర్శి చాంద్ బాష ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన పలు కీలక సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని చాంద్ బాష పేర్కొన్నారు. పీఆర్సీ, మధ్యంతర భృతి (ఐఆర్), సీపీఎస్, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగుల విభజన, జిల్లాల కేటాయింపులు తదితర ప్రధాన అంశాలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు వేదిక కావాలని అభిప్రాయపడ్డారు.

ఉద్యోగుల సమస్యలపై అన్ని రిజిస్టర్డ్ సంఘాలకు తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పించాలంటే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలకు గుర్తింపు పొందిన సంఘాలన్నింటినీ ఆహ్వానించడం అవసరమని చాంద్ బాష పేర్కొన్నారు. సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలు ఉద్యోగులందరికీ ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 16న గుంటూరుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

- 17న పల్నాడు జిల్లా కార్యక్రమంలో పాల్గొని విజయవాడకు ప్రయాణం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 16న గుంటూరు జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పర్యటన వివరాలను వెల్లడించారు.

ఈ నెల 16వ తేదీ సాయంత్రం గుంటూరు చేరుకోనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నగరంలోని ఐటీసీ హోటల్‌లో బస చేయనున్నట్లు తెలిపారు. అనంతరం 17వ తేదీ ఉదయం పల్నాడు జిల్లాలో నిర్వహించే అధికారిక కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు.

పల్నాడు జిల్లా కార్యక్రమాన్ని ముగించుకున్న అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నేరుగా విజయవాడకు ప్రయాణం కానున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

## మాజీ మంత్రి శనక్కాయల అరుణ ఓటు తొలగించలేదు : ఈఆర్వో మయూర్ అశోక్

- సోషల్ మీడియాలో ప్రచారమైన కథనాలపై స్పష్టీకరణ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి శనక్కాయల అరుణ ఓటు గల్లంతైందంటూ వివిధ మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై గుంటూరు నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) కె. మయూర్ అశోక్ సోమవారం వివరణ ఇచ్చారు. శనక్కాయల అరుణ ఓటు ప్రస్తుతం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని కొత్తపేట పోలింగ్ పార్ట్ నంబర్--109లో, సీరియల్ నంబర్--474 వద్ద నమోదై ఉందని తెలిపారు. ఆమె ఈపిక్ (ఙూ×జ) కార్డు నంబర్ాుళ2351633 కింద ఓటరుగా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఆమెకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇప్పటికే డిజిటలైజేషన్ ప్రక్రియలో నమోదు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటును తొలగించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

ఓటరు జాబితా లేదా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్వో, ఏఈఆర్వో లేదా గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల విభాగాన్ని సంప్రదించాలని మయూర్ అశోక్ సూచించారు.

## అందరికీ సంస్కృతం చేరువ చేయడమే అకాడమీ లక్ష్యం: ఆర్.డి. విల్సన్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పండితులు మాత్రమే సంస్కృత భాషను అధ్యయనం చేయగలరనే అపోహను తొలగించి, సమాజంలోని ప్రతి ఒక్కరికీ సంస్కృతాన్ని చేరువ చేయడమే సంస్కృత అకాడమీ లక్ష్యమని అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ అన్నారు. వడ్డేశ్వరంలోని తెలుగు, సంస్కృత అకాడమీలో సోమవారం నిర్వహించిన సంస్కృత మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో భిన్న కులాలు, మతాల మధ్య సమైక్యతను పెంపొందించే శక్తి సంస్కృత భాషకు ఉందని పేర్కొన్నారు. ప్రాచీన భారత జ్ఞాన సంపదకు సంస్కృతమే మూలమని, ఆధునిక కాలంలో అది కేవలం ధార్మిక భాషగా మాత్రమే పరిమితమైందనే అపోహను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు.

సదస్సులో పాల్గొన్న సంస్కృత పండితులు రాష్ట్రవ్యాప్తంగా సంస్కృత సప్తాహం నిర్వహించాలని, విద్యార్థుల్లో భాషపై ఆసక్తి పెంచేందుకు నీతికథలు, జాతీయ భావనలతో కూడిన చిన్న పుస్తకాలను ప్రచురించాలని సూచించారు. సంస్కృతం, తెలుగు భాషలు తల్లి--బిడ్డల వంటివని ఆచార్య దీక్షితులు పేర్కొనగా, అకాడమీ యూట్యూబ్ ఛానల్ ద్వారా సంస్కృత ప్రచారాన్ని విస్తరించాలని సూచించారు. ప్రపంచంలో అత్యంత ప్రాచీన భాషల్లో సంస్కృతానికి విశిష్ట స్థానం ఉందని ఆచార్య దొర్బల ప్రభాకర్ శర్మ అన్నారు. ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పిస్తే సంస్కృతంలో ఒరియంటేషన్ తరగతులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆచార్య రమణ శాస్త్రి తెలిపారు.

ఈ సమావేశంలో ఆచార్యులు పి.టి.జి.వి. రంగాచార్యులు, డాక్టర్ పాలపర్తి శ్యామలానందరావు, డాక్టర్ దివి నరసింహ దీక్షితులు, డాక్టర్ వందనరావు, డాక్టర్ రమణమూర్తి, ఆచార్య మారుదూరి నరసింహాచార్యులు, పిన్నమనేని భవాని, తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యుడు నందన్‌రావు, డాక్టర్ కనపాల కుమార్, వి.జి. చంద్రన్, అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరి, డాక్టర్ ఎస్.వి.టి. రాజ్యలక్ష్మి, డాక్టర్ గ్లోరీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చుకలంక పర్యాటకాభివృద్ధికి జీవో సవరణ చేయాలి

- సీఎం చంద్రబాబును కోరిన మంత్రి కందుల దుర్గేష్
- ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల పునరుద్ధరణ పనులకు సీఎం శంకుస్థాపన



**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్) :** తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌లో రూ. 151 కోట్లతో 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గోదావరి డెల్టా రైతాంగ శ్రేయస్సు కోసం సీఎం చంద్రబాబు దార్శనికతతో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతిన్న కాటన్ బ్యారేజ్ ఆధునికీకరణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, రాష్ట్ర అభివృద్ధి, రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రైతులకు అన్నదాత సుఖీభవ, ధాన్యం కొనుగోలు, ఎన్టీఆర్ భరోసా, దీపం 2.0, స్త్రీశక్తి వంటి సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తున్న నాయకుడు చంద్రబాబు అని అభివర్ణించారు.

ఈ సందర్భంగా పర్యాటక శాఖకు సంబంధించిన కీలక అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి కందుల దుర్గేష్, ధవళేశ్వరం సమీపంలోని పిచ్చుకలంకలో ఉన్న 62 ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో పర్యాటకాభివృద్ధికి వినియోగించుకునేలా ప్రస్తుతం అమల్లో ఉన్న జీవోలో సవరణలు చేయాలని కోరారు. ప్రస్తుతం 20 శాతం భూమిని మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉందని, పూర్తి భూమిని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తే గోదావరి ప్రాంతంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందని తెలిపారు. గోదావరి ప్రాంత సమగ్ర అభివృద్ధికి భారీ ప్రాజెక్టులను చేపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు జనసేన పార్టీ, అధికార కూటమి తరఫున మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ

- చర్చలతో సానుకూల వాతావరణం
- ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా హర్షం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం పట్ల ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్న సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి, జూలై 10, 11 తేదీల్లో మంత్రుల కమిటీతో సమావేశాలు నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామమని నాయకులు పేర్కొన్నారు. ఈ చర్చలతో ఉద్యోగుల్లో ప్రభుత్వంపై నమ్మకం మరింత పెరిగిందని తెలిపారు.

చర్చల్లో పీఆర్సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటన, పెండింగ్ డీఏల విడుదల, పెన్షనర్లకు అదనపు ప్రయోజనాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు, మహిళా ఉద్యోగులకు రెండేళ్ల చైల్డ్ కేర్ లీవ్, గ్రామ--వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లతో పాటు మొత్తం 21 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

రానున్న సమావేశంలో ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో జూలై 12న శ్రీకాకుళంలో నిర్వహించాల్సిన తొలి ఉద్యమ సన్నద్ధత సభను తాత్కాలికంగా వాయిదా వేయాలన్న రాష్ట్ర నాయకత్వం నిర్ణయాన్ని జిల్లా కమిటీ సమర్థించింది. ఉద్యోగ సంఘాలతో జరగనున్న తదుపరి సమావేశం అనంతరం ఉద్యమ కార్యాచరణపై తుది నిర్ణయం ప్రకటిస్తామని తెలిపింది. ఈ వివరాలను ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా జనరల్ సెక్రటరీ వై. శ్రీనివాసరావు, జిల్లా చైర్‌పర్సన్ ఎం. స్వరాజ్య లక్ష్మి, రాష్ట్ర కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి తదితరులు మీడియా సమావేశంలో వెల్లడించారు.

# పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేద్దాం

- బీజేపీ జిల్లా ఇన్‌చార్జి వై. దొరబాబు
- గుంటూరు జిల్లా నాయకులతో సమీక్ష సమావేశం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన సోమవారం జిల్లా కార్యాలయం వాజ్‌పేయి భవన్‌లో జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన వై. దొరబాబుతో జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, పార్టీలో అనేక బాధ్యతలు విజయవంతంగా నిర్వహించిన దొరబాబు గుంటూరు జిల్లా ఇన్‌చార్జిగా రావడం సంతోషకరమని, ఆయన సూచనలు, సలహాలతో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు.

జిల్లా ఇన్‌చార్జి వై. దొరబాబు మాట్లాడుతూ గుంటూరు జిల్లాతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, అందరూ కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ విస్తరణకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్వోలు, బీఎల్ఏ--1లతో కలిసి జిల్లా, మండల స్థాయి నాయకులు అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అర్హత లేని ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ శివమకుటం, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కె.వి. సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాస్ రెడ్డి, ఎడ్లపాటి స్వరూపరాణి, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరి, మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైరోజ్, మార్కాపురం జిల్లా ఇన్‌చార్జి కొక్కర శ్రీనివాస్, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి భీమిలి చంద్రశేఖర్, బాపట్ల జిల్లా ఇన్‌చార్జి గాజుల వెంకయ్యనాయుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితి ప్రదీప్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి హరి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## 17న మంగళగిరి ఆధునిక రైల్వే స్టేషన్‌ను జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోదీ

- అమృత్ భారత్ స్టేషన్ పథకంలో రూ.12.56 కోట్లతో పునర్వ్యవస్థీకరణ పూర్తి




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** అమృత్ భారత్ స్టేషన్ పథకం (ాూదీూా) కింద ఆధునికీకరించిన మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. దక్షిణ కోస్ట్ రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని ఎన్ఎస్‌జీ-4 కేటగిరి స్టేషన్‌గా ఉన్న మంగళగిరి రైల్వే స్టేషన్‌ను రూ. 12.56 కోట్ల వ్యయంతో ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలు, అత్యాధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రస్తుత స్టేషన్ భవనాన్ని ఆధునికీకరించడంతో పాటు రెండో ప్రవేశ ద్వారం, కొత్త బుకింగ్ కార్యాలయం, విశాలమైన నిరీక్షణ మందిరాలు, వీఐపీ లాంజ్, ఆకర్షణీయమైన ముఖద్వారం, మెరుగైన మరుగుదొడ్లు, ప్లాట్‌ఫారాల అభివృద్ధి, కొత్త షెల్టర్లు, ప్రమాణీకరించిన సమాచార బోర్డులు, ఉద్యానవనాలను ఏర్పాటు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం రెండు లిఫ్టులు, దివ్యాంగులకు టాక్టైల్ పాత్‌వేలు, ర్యాంపులు, ప్రత్యేక మరుగుదొడ్లు కల్పించారు. స్టేషన్ ముందు, వెనుక భాగాల్లో పార్కింగ్, పాదచారుల మార్గాలు, వీధి దీపాలు, సుందరీకరణ పనులతో పాటు ప్రవేశ, నిష్క్రమణ వ్యవస్థను కూడా మెరుగుపరిచారు.



ఆధునిక అంతర్గత అలంకరణ, రిటైరింగ్ రూములు, ఆధునిక టికెట్ బుకింగ్ సౌకర్యాలు, స్థానిక సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే కళాత్మక అలంకరణలతో మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ప్రాంతీయ స్థాయిలో ఒక ఆధునిక రవాణా కేంద్రంగా తీర్చిదిద్దినట్లు గుంటూరు డివిజన్ పేర్కొంది.

అమృత్ భారత్ స్టేషన్ పథకం లక్ష్యాలకు అనుగుణంగా ఈ అభివృద్ధి ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రాంతీయ సామాజిక, ఆర్థికాభివృద్ధికి కూడా ఊతమిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి: కమిషనర్




- ఎస్ఐఆర్ ప్రక్రియపై వార్డు సచివాలయాల్లో తనిఖీలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను అత్యధిక ప్రాధాన్యతతో త్వరితగతిన డిజిటలైజేషన్ చేయాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. సోమవారం నగరంపాలెం, ఆర్. అగ్రహారం, ఎన్ఎస్‌పీ కెనాల్ క్వార్టర్స్ వార్డు సచివాలయాలను సందర్శించిన ఆయన, బీఎల్వోలు చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎన్యూమరేషన్ అత్యంత కీలకమైన అంశమని, ఎలాంటి జాప్యం లేకుండా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బీఎల్వోలు చేపడుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై సూపర్‌వైజరీ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, క్షేత్రస్థాయిలో లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు చెందిన వీఐపీలు, మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధుల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసి, మ్యాపింగ్ పూర్తి చేసి, సంబంధిత కార్డు వివరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుంటూరు నగర పరిధిలో ఎన్యూమరేషన్ ఫారాలు అందని ఓటర్లు స్థానిక సచివాలయం లేదా సంబంధిత బీఎల్వోను సంప్రదించాలని సూచించారు.

## ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు చరిత్రను వక్రీకరించే ప్రయత్నమే



- ఏపీ బీజేపీ మీడియా ఇన్‌చార్జి దిలీప్ కిలారు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు భారత స్వాతంత్ర్య సమరంలో ఎలాంటి పాత్ర లేదని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలు చారిత్రక వాస్తవాలకు విరుద్ధమని ఏపీ బీజేపీ మీడియా ఇన్‌చార్జి దిలీప్ కిలారు అన్నారు. ఆర్ఎస్ఎస్‌ను విమర్శించే ముందు చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డాక్టర్ కేశవ్ బలీరామ్ హెగ్డేవార్ స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని, 1921, 1930 సంవత్సరాల్లో జైలుశిక్ష కూడా అనుభవించారని గుర్తు చేశారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మంది ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు తమ వంతు పాత్ర పోషించారని దిలీప్ కిలారు పేర్కొన్నారు. ముఖ్యంగా 1942 క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో స్థానిక నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం, అజ్ఞాతంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధులకు ఆశ్రయం, సహకారం అందించడం వంటి బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. దేశ విభజన సమయంలో శరణార్థుల రక్షణ, సహాయ శిబిరాల నిర్వహణ, నిరాశ్రయ కుటుంబాలకు అండగా నిలవడం వంటి సేవలను కూడా ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు అందించారని చెప్పారు. ప్రకృతి విపత్తులు, యుద్ధాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆర్ఎస్ఎస్ నిరంతరం సేవలందిస్తోందని పేర్కొన్నారు.

చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా సమగ్రంగా అధ్యయనం చేయాలని దిలీప్ కిలారు పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్యం అనేది భిన్న సంస్థలు, భిన్న సిద్ధాంతాలు, దేశవ్యాప్తంగా అనేక మంది దేశభక్తుల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు. తాను రచించిన 'భారత్ రైజింగ్: ఇన్ ది మోదీ ఎరా' పుస్తకంలో కూడా ఈ అంశాలను విశ్లేషించానని తెలిపారు. దేశ సేవలో నిస్వార్థంగా పనిచేసిన ప్రతి దేశభక్తుడిని గౌరవించాలని, జాతీయవాదం అనేది కేవలం నినాదం కాదని, భారతమాత సేవకు అంకితభావంతో కూడిన జీవన విధానమని వ్యాఖ్యానించారు.

## 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు స్వాగతం

- కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఏపీసీపీఎస్ఈఏ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.53 ద్వారా సుమారు 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బందికి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయడాన్ని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్వాగతించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్, ప్రధాన కార్యదర్శి సీఎం దాస్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో-57ను రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.53 ద్వారా అమలు చేయడంతో 2004 సెప్టెంబర్ 1కు ముందు నియామక ప్రకటన వెలువడినా, సాంకేతిక కారణాలతో సీపీఎస్ పరిధిలోకి వెళ్లిన 7,361 మంది ఉపాధ్యాయులు, 1,832 మంది పోలీసు సిబ్బంది, 1,800 మంది గ్రూప్--1, గ్రూప్--2 అధికారులతో కలిపి సుమారు 11 వేల మందికి ఓపీఎస్ వర్తించనుందని తెలిపారు. ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మెమో--57 అమలు కోసం ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించిన ఏపీ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ అమలు చేసిన తొలి రాష్ట్రంగా, గ్రాట్యుటీ అమలు చేసిన రెండో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని గుర్తు చేశారు. ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం సీపీఎస్ ఉద్యోగులకు మరింత భరోసా కల్పిస్తుందని పేర్కొంటూ, మిగిలిన సీపీఎస్ ఉద్యోగులందరికీ కూడా త్వరలోనే పాత పెన్షన్ విధానం అమలు చేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467